


మహిళా దినోత్సవ ప్రత్యేకం

శ్రీసిటీ ప్రతినిధి

'ఆకాశంలో సగం' అన్నది ఒక ఆకాంక్ష, వివక్ష, స్త్రీ నిరసన స్వరం. అణచివేతపై ధిక్కార నినాదం.

'అవనిలో సగం' అన్నది ఒక నిజం. ప్రపంచ జనాభాలో పురుషులకన్నా స్త్రీల సంఖ్యే అధికం.

అయినా సకల రంగాల్లోనూ, సకల అంశాల్లోనూ చిన్నచూపు. చులకనభావం. అనుమానం.. అవమానం.. నీడలా వెంటాడే వాస్తవం. మనుధర్మం పేరుతో సాగిన వందల యేళ్ల వివక్ష ఇంకానా.. ఇకపై చెల్లదంటూ ఆడవాళ్లు పిడికిళ్లెత్తి నిరూపిస్తున్నారు. ఎక్కడైనా..ఎప్పుడైనా.. ఏ పనిలో అయినా తగ్గం అంటూ సవాలు విసురుతున్నారు. పార్లమెంటు సహా ఏ చట్ట సభల్లోనూ లేని సమాన భాగస్వామ్యాన్ని పరిశ్రమల్లో సాధించి నిరూపించారు. అందుకు సాక్ష్యమే తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ. దేశంలోనే అత్యద్భుత ఫలితాలను రాబట్టిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో 220 పరిశ్రమలున్నాయి. వీటిలో 59 వేల మంది ఉద్యోగులున్నారు. వీరిలో 30 వేల మందికి పైగా మహిళలే కావడం శ్రీసిటీ ప్రత్యేకత. మెట్రో రైళ్ల మొదలు, కోల్గేట్ బ్రష్‌ల దాకా మహిళల చేతుల్లో ఇక్కడ రూపుదిద్దుకుంటున్నాయి.



స్త్రీసిటీగా ఇలా మారింది...

మహిళా సాధికారతకు శ్రీసిటీ సజీవ నిదర్శనం. ఆర్థిక స్వావలంబన గల స్త్రీలు లింగ వివక్షను ప్రశ్నిస్తారు. అణచివేతను ఎదుర్కొంటారు. ఆత్మాభిమానంతో వ్యవహరిస్తారు. అన్నింటికన్నా ముఖ్యంగా తమ బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు పరుస్తారు. సత్యవేడు, వరదయ్యపాళెం, తడ, సూళ్లూరు పేట ప్రాంతాల్లోని మహిళల జీవనశైలిలో వచ్చిన మార్పే ఇందుకు సాక్ష్యం. మగవాళ్లలా సంపాదించినదంతా తాగుడుకు తగలేయరు. ప్రతి రూపాయినీ అపురూపంగా కుటుంబం కోసం ఖర్చు చేస్తారు. ఈ ఆత్మవిశ్వాస భాగస్వామ్యం శ్రీసిటీ పరిధిలోని అనేక గ్రామాల రూపురేఖల్లోనే మార్పునకు కారణం అవుతోంది. స్త్రీలు సునిశితంగా, మరింత దీక్షగా, శ్రద్ధగా, నైపుణ్యంతో పనిచేస్తారు. సవాలక్ష పనులు ఏకకాలంలో చేసే స్కిల్ స్త్రీలకు కుటుంబం నేర్పింది. ఇదే పరిశ్రమలకు ప్రయోజనకర అంశంగా మారింది. ఉత్పాదకతనూ, నాణ్యతనూ పెంచింది. దీంతో స్థానిక మహిళలకు అవసరమైన శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లోకి తీసుకుంటున్నారు. పల్లెలను పరిశ్రమల్లోకి ఒక ప్రవాహంలా ఇప్పుడు స్త్రీలు వస్తున్నారు. భారతదేశ పారిశ్రామిక చిత్రపటంలోనే ఒక విభిన్నమైన స్థానాన్ని ఆడవాళ్ల శ్రీసిటీకి సాధించి దానిని స్త్రీ సిటీగా మార్చేశారు. ఇప్పుడీ పారిశ్రామిక మండలి సిరిసిటీగా విలసిల్లడానికి స్త్రీల భాగస్వామ్యమే ప్రధానంగా మారింది.

కదిలే మహిళా శక్తి

పరిశ్రమల బస్సుల్లో, ఆటోల్లో యూనిఫారాల్లో ఆడవాళ్ల సమూహాలుగా కదిలిపోయే అరుదైన దృశ్యం ఇక్కడ కనిపిస్తుంది. బొమ్మలు తయారు చేసే సంస్థ పాల్స్ ఫ్లష్‌లో 95 శాతం ఆడవాళ్లే ఉన్నారు. ఎంఎస్ఆర్ గార్మెంట్స్‌లో 92 శాతం స్త్రీలు పనిచేస్తున్నారు. బ్లూస్టార్‌లో 600మంది ఉద్యోగులుంటే 300మంది మహిళలే. భారత్ ఎఫ్ఐజీ (ఫాక్స్‌కాన్ గ్రూప్) మొబైల్ తయారీ కంపెనీలో 5,000మంది ఉంటే 4,500మంది మహిళలు, జెన్ లినెన్‌లో 550మంది ఉద్యోగుల్లో 380మంది మహిళలున్నారు. 350 మంది చేసే ఎవర్టన్ టీలో 330మంది మహిళలే ఉన్నారు.

ఈ పరిశ్రమల్లో అందరూ స్త్రీలే

కొన్ని పరిశ్రమల్లో అయితే కేవలం మహిళలు మాత్రమే పనిచేస్తుండడం మరీ విశేషం. స్థానిక మహిళలకు ఇదొక వరంగా మారింది. కోల్గేట్ (టూత్ బ్రష్‌లు), ఎవర్టన్ టీ, క్యాడ్బరీ చాక్లెట్లు, జెన్ లెనిన్ (సింథటిక్ ఫైబర్ వరుపులు, దిళ్ళు, దుప్పట్లు), ఎంఎస్ఆర్ గార్మెంట్స్ (సూట్లు), ఫాక్స్‌కాన్ (మొబైల్ ఫోన్లు), బ్లూస్టార్, డైకిన్, హావెల్స్ (ఎయిర్ కండిషనర్లు), ఆల్‌స్టమ్ (మెట్రో రైళ్ల)లో మహిళా కార్మికుల పాత్ర ప్రముఖమైనది.

చెల్లెళ్లను చదివిస్తున్నా

మా తల్లిదండ్రులకు ముగ్గురు ఆడ సంతానం. మా నాన్నది చిన్న ప్రైవేటు ఉద్యోగం. నేను పెద్ద దానిని. నేను 12వ తరగతి వరకు గురుకుల పాఠశాలలో చదివా. ఆపై సూళ్లూరుపేటలో ఓ ప్రైవేటు కళాశాలలో బీ ఫార్మసీ పూర్తిచేశా. వెంటనే శ్రీసిటీలోని క్యాడ్బరీ కంపెనీలో ఉద్యోగంలో చేరి నాలుగేళ్లు పని చేశా. ఆపై నా చదువుకు తగ్గ ఉద్యోగం దొరకడంతో ప్రస్తుతం ఎక్సలెంట్ ఫార్మా పరిశ్రమలో క్వాలిటీ డివిజన్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఏడాదిగా పని చేస్తున్నా. నా సంపాదనతో నా ఇద్దరి చెల్లెళ్ల చదువుకు ఆసరాగా నిలిచా. ఒకచెల్లి పెళ్లికి రూ.5 లక్షలు సాయం చేయగలిగా.

- సౌజన్య, సూళ్లూరుపేట

పరిశ్రమల్లోనూ సగం

ఊరి దగ్గరే ఉద్యోగం

మాది వరదయ్యపాలెం రైతు కుటుంబం. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివా. చదువు పూర్తయ్యే సమయంలోనే పెళ్లి, ఆపై ఇద్దరు పిల్లలు. ఇక కుటుంబానికి దూరంగా నగరాలకు వెళ్లి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే అవకాశం లేదు. అయితే గ్రామానికి అతి సమీపంలో శ్రీసిటీ రూపంలో మరో అవకాశం వచ్చింది. మొదట తోహరాకు స్టీల్స్ ప్రస్తుతం వీఆర్‌వీ పరిశ్రమలో ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నా.

- బి.మనీష, వరదయ్యపాళెం

మెట్టినింటికి వచ్చినా..



టెక్స్‌టైల్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ చేసిన నేను పెళ్లికి ముందు చెన్నై పరిసరాల్లో ఉద్యోగం చేసేదానిని. పెళ్లి తర్వాత అక్కడ ఉద్యోగం మానేసి సత్యవేడు వచ్చా. మెట్టినింటికి వచ్చాక భర్త, అత్తమామల ప్రోత్సాహంతో సమీపంలోనే శ్రీసిటీ జెన్‌లెనిన్ వస్త్ర పరిశ్రమలో సేల్స్ అండ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం లభించింది. రెండేళ్లుగా పని చేస్తున్నా.

- మీనాక్షి, సత్యవేడు

ఇద్దరం ఇక్కడే..



నేను బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చేసి గతంలో ఉత్తర భారత్‌లోని రెండు ప్రాంతాల్లో పని చేశా. నా భర్త శ్రీసిటీలో మొండెలెజ్ పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్న కారణంగా ఈ ప్రాంతానికి వచ్చి నాలుగేళ్లుగా జెన్‌లెనిన్ వస్త్ర పరిశ్రమలో క్వాలిటీ డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నా.

- సుస్మీపల్లవి సాహు, ఒడిశా

వేడెక్కిన తిరుపతి రాజకీయం

- పవన్ తప్ప బయటి వారు గెలవడం కష్టం!
- అచ్చెన్నకు తేల్చి చెప్పిన తిరుపతి టీడీపీ నేతలు
- ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

తిరుపతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తిరుపతి టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మలకు స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి పిలిపించిన అచ్చెన్నాయుడు తిరుపతికి ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు ఖరారైనా వారి గెలుపుకోసం సహకరించాలని చంద్రబాబు మాటగా చెప్పారు. అయితే తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే పర్వాలేదని, అలాకాక స్థానికేతర అభ్యర్థి అయితే గెలవడం కష్టమని వారు కూడా అచ్చెన్నాయుడికి తేల్చి చెప్పేశారు. పార్టీ ఆవిర్భావం నుంచీ తన కుటుంబం తిరుపతిలో టీడీపీ కోసం కష్టపడి పనిచేస్తోందని, గత నాలుగు ఎన్నికల్లో టికెట్ ఆశించినా అవకాశం దక్కలేదని అచ్చెన్న ఎదుట నరసింహ యాదవ్ వాపోయారు.అనంతరం మనస్తాపంతోనే తిరుపతికి వెనుదిరిగారు.


టికెట్ ఇస్తే జనసేనలో చేరేందుకు సుగుణమ్మ సిద్ధం

టీడీపీ టికెట్‌పై గంపెడు ఆశ పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా తిరుపతి సీటును మిత్రపక్షమైన జనసేనకు కేటాయించడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. అయితే ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ దక్కేటట్టు అయితే జనసేనలో చేరేందుకు సిద్ధంగా వున్నట్టు తెలిసింది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలవడానికి యత్నిస్తున్నట్టు తెలిసింది.ఆయన ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాక కలిసే ఉద్దేశంతో సుగుణమ్మ అక్కడే వున్నారని సమాచారం.ఆశావహులందరిలోనూ తనకే గెలుపు అవకాశాలు అధికంగా వున్నాయని, ఆ మేరకు టికెట్ ఇవ్వాలని జనసేన అధినేతను కోరనున్నట్టు తెలిసింది. గురువారం తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ మంగళగిరిలో పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఉమ్మడి అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. తిరుపతిలో అభ్యర్థి ఎవరైతే విజయావకాశాలు అధికంగా వుంటాయో తెలుసుకునేందుకు సర్వేలు నిర్వహిస్తున్నామని, వాటి ఫలితాలు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని పవన్ స్పష్టం చేసినట్టు తెలిసింది. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన తిరుపతి జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ కూడా పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లను కలిశారు.చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి జనసేన టికెట్ రేసులో వున్నట్టు ప్రచారమవుతున్న సంగతి తెలిసిందే. అయితే గురువారం ఆయన మంగళగిరిలో జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ శ్రీనివాసులు ఎలాంటి షరతులు లేకుండా, టికెట్ కూడా ఆశించకుండా జనసేనలో చేరుతున్నారని ప్రకటించారు. ఈ వ్యాఖ్యతో శ్రీనివాసులుకు తిరుపతి టికెట్ విషయమై పార్టీ వర్గాల్లో అనుమానాలు తలెత్తాయి.

జనసేన టికెట్ తిరుపతి బలిజలకే ఇవ్వాలి!

తిరుపతి అర్బన్, మార్చి 7:తిరుపతి జనసేన టికెట్ స్థానిక బలిజలకే కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంది. గురువారం బలిజసేన ఆధ్వర్యంలో మన తిరుపతి-మన బలిజలు-మన సీటు అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.బలిజసేన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్,విజయ్ మాట్లాడుతూ రాయలసీమవ్యాప్తంగా చూస్తే తిరుపతిలో బలిజలు అధిక సంఖ్యలో వున్నారని, జనసేన గెలిచే మొదటి సీటు కూడా తిరుపతే అవుతుందని అభిప్రాయపడ్డారు. అంగబలం, అర్థబలం చూపి టికెట్ తెచ్చుకునే స్థానికేతరులకు తాము సహకరించబోమని తేల్చి చెప్పారు. స్థానిక బలిజలకే టికెట్ ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ డిమాండ్ ముందుముందు బలపడే పరిస్థితి కనిపిస్తోంది.మొత్తం మీద పవన్ కళ్యాణ్ ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాకే తిరుపతి సీటుపై దృష్టి సారించే అవకాశముంది. ఎలా చూసినా మరో వారం రోజుల పాటు తిరుపతి ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ కొనసాగనుంది.

శేష వాహనంపై శివయ్య చిద్విలాసం


శేష, యాళి వాహనాలపై ఆదిదంపతులు

శ్రీకాళహస్తి, మార్చి 7: నాగభూషణుడైన శివయ్య ఆదిశేషుని పడగ నీడలో గురువారం రాత్రి భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. ఆయన దేవేరి జ్ఞానాంబిక అమ్మవారు యాళి వాహనంపై కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజును నాగరాత్రిగా ఆరాధించారు. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామి, చిలుక వాహనంపై అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహనంపై పరమశివుడు, యాళి వాహనంపై పార్వతీదేవి, ముందుగా మూషిక వాహనంపై వినాయక స్వామి, చప్పరాలపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారంగా సాగింది. కళాకారుల కోలాటాల నడుమ శివనామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిమ్మ అధరహో



గూడూరు అర్బన్, మార్చి 7 : వేసవి ప్రారంభంలోనే నిమ్మ ధర అదరగొడుతోంది.వినియోగదారులకు కాస్త భారం అనిపిస్తున్నా, కర్షకులకు మాత్రం కాసులు కురిపిస్తోంది.గూడూరు మార్కెట్‌లో గురువారం కిలో నిమ్మకాయలు రూ.70తో మొదలై రూ.85 వరకు పలికింది.80కిలోల బస్తా సుమారు రూ.6,500 పలికింది. గతేడాది ఇదే సమయంలో కిలో రూ.50కు మించింది లేదని వ్యాపారులు చెబుతున్నారు.ఈ ఏడాది ప్రారంభంలో రూ.40తో మొదలైన ధరలు ప్రస్తుతం రూ.80 వద్ద స్థిరంగా ఉండడంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మరింత పెరిగి కిలో రూ.200కు చేరుకోవచ్చునని నిమ్మరైతులు ఆశిస్తున్నారు.

వైసీపీ కార్యకర్త వీరంగం

శ్రీకాళహస్తిలో టీడీపీ ప్రచార రథం లైటు ధ్వంసం, డ్రైవర్‌పై పిడిగుద్దులు

- ఆపై నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడక సీన్
- అర్ధగంటపాటు స్తంభించిన ట్రాఫిక్


రోడ్డుపై బస్సుకు అడ్డుగా పడుకున్న బత్తెయ్య




పగిలిన టీడీపీ ప్రచార రథం లైటు

శ్రీకాళహస్తి మార్చి 7: శ్రీకాళహస్తిలో బత్తెయ్య అనే వైసీపీ కార్యకర్త రెచ్చిపోయాడు. టీడీపీ ప్రచార రథం, డ్రైవర్‌పై దాడిచేయడమే కాక, నడిరోడ్డుపై బస్సుకు అడ్డుగా పడుకుని వీరంగం చేశాడు. దీన్ని చూసిన స్థానికులంతా ఏం జరుగుతుందో అర్థంకాక హడలిపోయారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం ఓ తెలుగు మహిళను టీడీపీ ప్రచార రథంలో ఎక్కించుకుని శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయం వద్ద దింపేందుకు డ్రైవర్ కిరణ్ బయల్దేరాడు. సరిగ్గా పురపాలక కార్యాలయం వద్దకొచ్చేసరికి శ్రీకాళహస్తి పట్టణ శివారు ఈదులగుంట ప్రాంతానికి చెందిన వైసీపీ కార్యకర్త బత్తెయ్య.. ఎంఎస్ఆర్ అనే స్టిక్కర్ వేసుకుని ఉన్న తన ద్విచక్ర వాహనాన్ని టీడీపీ ప్రచార రథానికి అడ్డుగా పెట్టాడు. దుర్భాషలాడుతూ ప్రచార రథం లైటును ధ్వంసం చేశాడు. మద్యం మత్తులో ఉన్న అతను డ్రైవర్‌ని బయటకు లాగి మరీ అందరూ చూస్తుండగానే పిడిగుద్దులు కురిపించాడు. తప్పించుకోవడానికి ప్రయత్నించినా వదలకుండా వెంటాడి మరీ కొట్టాడు. ఎట్టకేలకు తప్పించుకున్న కిరణ్ తమ పార్టీ నాయకులకు విషయం ఫోన్లో తెలిపాడు. టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. దాంతో వైసీపీ కార్యకర్త నడిరోడ్డుపై ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడుకున్నాడు. ఇదంతా చూసిన జనమంతా నివ్వెర పోయారు. వీరంగం చేస్తున్న యువకుడిని ప్రశ్నించేందుకు కూడా హడలిపోయారు. అతను మాత్రం జగనే రావాలి.. జగన్ కావాలి అంటూ.. నినాదాలు చేస్తూ రోడ్డుపై నుంచి 20నిమిషాల పాటు లేవలేదు. దీనివల్ల ఆ ప్రాంతమంతా ట్రాఫిక్ స్తంభించింది. శ్రీకాళహస్తి రెండు పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని పక్కకు లాగారు.

నెల కిందట కూడా..

నెల రోజుల కింద కూడా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద టీడీపీ ప్రచార రథాన్ని ముగ్గురు వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో అప్పట్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాలు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేశారు. మళ్లీ శ్రీకాళహస్తిలో అదే తరహాలో ప్రచార రథంపై గురువారం వైసీపీ కార్యకర్త రెచ్చిపోవడం గమనార్హం.



రోడ్డు ప్రమాదంలో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ, ఇంజన్

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



గాయపడిన డ్రైవర్ రమేష్

చంద్రగిరి, మార్చి 7: తొండవాడ సమీపంలో గురువారం ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొనడంతో బోల్తాపడింది.పోలీసుల కథనం మేరకు... వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె నుంచి కాసిరాయి లోడుతో ట్రాక్టర్ తిరుపతి వెళుతుండగా, హోసూర్ నుంచి శ్రీకాళహస్తికి మైన్స్ లోడుతో వస్తున్న లారీ తొండవాడ సమీపంలోకి రాగానే ఢీకొంది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడింది. అందులో కాసిరాయి జాతీయ రహదారిపై చెల్లాచెదురుగా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్‌ను తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయాలకు మైక్ సెట్ల వితరణ

చంద్రగిరి, మార్చి 7: మండలంలోని తొండవాడ, మల్లయ్యపల్లె, చంద్రగిరి దాసరివీధి, పలు గ్రామాల్లోన్ని శివాలయాలకు గురువారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి మైక్ సెట్లు వితరణ చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా

పాకాల, మార్చి 7: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా విద్యార్థినులకు హెయిర్ స్టైయిల్, మెహిందీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.మహిళా విభాగం సమన్వయ కర్త డాక్టర్ మాదవి, వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రమేష్ కుమార్, మాశిలామణి, చిట్టికళావతి, మోహన్ బెహరా పాల్గొన్నారు.

చంద్రగిరి కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు

పాకాల, మార్చి 7: చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కలికిరి నారాయణస్వామి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు దరఖాస్తు అందజేశారు.పీసీసీ కార్యదర్శిగా పనిచేశానని, రాహుల్ గాంధీ జోడో యాత్రలో కర్నూలు జిల్లా ఆలూరు ఇన్‌చార్జ్‌గా సేవలు అందించానన్నారు.

సొంత పొలంలో సీసీ రోడ్డు వద్దన్నందుకు దాడి

పాకాల, మార్చి 7: తన పొలంలో సీసీ రోడ్డు వేయొద్దని చెప్పినందుకు గ్రామానికి చెందిన కొందరు తమపై దాడి చేశారని కె.వడ్డేపల్లె పంచాయతీ పెద్దమ్మగారిపల్లెకు చెందిన ఎస్.రమేష్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పొలంలో అనుమతి లేకుండా సీసీ రోడ్డు వేయడానికి ప్రయత్నించడంతో సర్వేయర్‌తో సర్వే చేయించి రాళ్లు నాటుకున్నామన్నారు. దీంతో ఎం. యశ్వంత్ రెడ్డి, ఎం. ఘనకిరణ్ రెడ్డి, పి.హరీష్ రెడ్డి, పి.సతీష్ రెడ్డి 5వ తేది రాత్రి రాడ్లు, గడ్డపార్లతో తమ ఇంటిపై దాడి చేశారన్నారు. తన తల్లిదండ్రులను భయపెట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెవిరెడ్డి ప్రలోభాలకు, బెదిరింపులకు కాలం చెల్లింది

- ఇంటింటి ప్రచారంలో పులివర్తి నాని



ముండ్లపూడి గ్రామంలో ప్రచారం చేస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 7:ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రలోభాలకు, బెదిరింపులకు కాలం చెల్లిందని...త్వరలోనే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపిస్తారని చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. గురువారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా జనసేన, టీడీపీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కూడా ప్రభుత్వ పనితీరుపై విరక్తి చెంది ఉన్నారన్నారు. ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే చెవిరెడ్డి ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. దొంగ ఓట్లపై చంద్రగిరి ఎమ్మెల్యే ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా పులివర్తి కుటుంబం చట్టాన్ని గౌరవిస్తూ న్యాయపోరాటంతో ముందు కెళుతుందన్నారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, మోహన్ రెడ్డి, విజయకుమార్, కళావతి, మునికృష్ణారెడ్డి, మునికృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తాం : టీడీపీ



రామచంద్రాపురం, మార్చి 7: చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పులివర్తి నానీకి ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తారని పులివర్తి సుధారెడ్డి అన్నారు. మండలంలోని నెన్నూరు గ్రామంలో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ చంద్రగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇవ్వడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పులివర్తి నానిని గెలిపించాలని టీడీపీ నాయకులతో కలిసి సుధారెడ్డి ప్రచారం నిర్వహించారు.మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, నాయకులు చినబాబు, జనార్దన చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, ఢిల్లీనాథరెడ్డి, ధనంజయరెడ్డి, గిరినాయుడు, మధుసూదన్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, సాయి ప్రసాద్, కమలాకర్‌రెడ్డి, మున్నార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు మైక్‌సెట్ల అందజేత

రామచంద్రాపురం, మార్చి 7: మండలంలోని రావిళ్లవారిపల్లె రాజరాజేశ్వర పీఠం, రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయం, బ్రాహ్మణకాల్వ, గంగిరెడ్డిపల్లె, అనుపల్లి ఆలయాలకు తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి గురువారం వైసీపీ నాయకుల ద్వారా మైక్‌సెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, దామోదరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మురగయ్య,చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరిరాజుపై అలిమేలుమంగ అభయం



తిరుచానూరు, మార్చి 7: తిరుచానూరులోని అలమేలుమంగ గజవాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని గురువారం రాత్రి అమ్మవారికి గజవాహన సేవ వేడుకగా జరిగింది. డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, మధు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుభాస్కర్‌నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం





రథంలో దేవేరులతో కల్యాణ వెంకన్న

చంద్రగిరి,మార్చి7: శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి గురువారం ఉదయం రథంపై ఉభయదేవేరులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 5.30 గంటలకు రథోరోహణం నిర్వహించారు. 7.10 నుంచి 8.30 గంటల వరకు ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి రథంపై ఊరేగించారు.గోవింద నామస్మరణలు, చెక్క భజనలు, కోలాటాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తులు రథాన్ని లాగారు. రాత్రి ఉత్సవమూర్తిని కల్కి అవతారంగా అలంకరించి అశ్వ వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు.ఆలయ డిప్యూటీ ఈవోల వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, కంకణ భట్టర్ శేషాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.కాగా శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు చక్రస్నానం జరగనుంది.

నంది వాహనంపై సిద్ధేశ్వరుడు



ఎర్రావారిపాలెం, మార్చి7 :శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తలకోన సిద్ధేశ్వరి సమేత సిద్ధేశ్వర స్వామి నంది వాహనంలో కనువిందు చేశారు.కల్యాణోత్సవం ముందురోజు నెరబైలు గ్రామంలో స్వామి వారు నందివాహనంపై ఊరేగుతూ దర్శనమివ్వడం ఆనవాయితీ. అందులో భాగంగా గురువారం రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకు నెరబైలు పుర వీధుల్లో నంది వాహన సేవ జరిగింది. ప్రధాన అర్చకులు ప్రసన్న స్వామి , ఈవో జయకుమార్, ఆలయ చైర్మన్ వేణుగోపాల రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మంజుల, నాగిరెడ్డి, జయంత్, మదుసూదన శెట్టి, రాజేశ్వరి, పుర ప్రముఖులు పాల్గొన్నారు.



కల్పతరువు, నంది వాహనాల్లో దర్శనమిస్తున్న పార్వతీపరమేశ్వరులు

కల్పతరువు, నంది వాహనాల్లో శివపార్వతుల దర్శనం

చంద్రగిరి, మార్చి7:మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం తొండవాడ అగస్త్యేశ్వరాలయంలో కల్పతరువు వాహనంపై, రాత్రి నంది వాహనంపై శివపార్వతులు ఊరేగారు.ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం

చంద్రగిరి, మార్చి 7: టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ యువనేత పులివర్తి వినీల్ అన్నారు. గురువారం చంద్రగిరి మండలం కాశిపెంట్ల పంచాయతీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మాజీ సర్పంచ్ గాలిసతీష్, కొండేపాటి అనిల్‌చౌదరి, రవినాయుడు, పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన ప్రచార వాహనాలకు స్వాగతం

భాకరాపేట, మార్చి 7: టీడీపీ, జనసేన విజయం కోసం ఎన్‌ఆర్‌ఐ కొట్టే వెంకట్రావు బృందం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పర్యటనలో భాగంగా గురువారం చిన్నగొట్టిగల్లుకు చేరుకుంది. తెలుగు మహిళా విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టే సుజాత, మాజీ సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికారు.

భీమా నది లోడేస్తున్నారు

- ఇసుక రవాణాపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



శేషాపురం వద్ద భీమానదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు



పంచాయతీ కార్యాలయానికి తాళం వేస్తున్న ఉపసర్పంచ్ రాకేష్‌చౌదరి

చంద్రగిరి, మార్చి 7: చంద్రగిరి మండలం కందులవారిపల్లె సమీపంలోని భీమా నదిలో శేషాపురానికి చెందిన వైసీపీ నాయకుడు యంత్రాలు ఉపయోగించి, టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాడు. సర్పంచ్ భర్త గిరినాయుడు, ఉప సర్పంచ్ రాకేష్‌చౌదరి ఈ విషయమై స్థానిక వీఆర్వో, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో గురువారం సాయంత్రం వారిద్దరూ పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేశారు. సమాచారం అందుకున్న కార్యదర్శి మీనాకుమారి ఫోన్ చేసి తాళం తీయాలని కోరారు. తమ సమస్య పరిష్కారమయ్యేంత వరకు తాళాలు తీయబోమని సమాధానమిచ్చారు. వైసీపీ నాయకులు కందులవారిపల్లెకు చేరుకుని వారిద్దరితో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో వెంకటసూర్యసాయి ఉపసర్పంచ్‌కు ఫోన్ చేసి, ఇసుక అక్రమ రవాణా తమ పరిధి కాదని, ఎస్‌ఈబీ అధికారుల ఫోన్ నెంబర్లు ఇస్తామని, వారికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేసే వాహనాల ఫొటోలుంటే ఎస్‌ఈబీ అధికారుల చేత సీజ్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో హామీతో పంచాయతీ కార్యాలయ తాళం తీశారు.



భీమానదిలో ఇసుక తరలిస్తున్న టిప్పర్లు

తుమ్మలగుంట భూబాధితులకు

న్యాయం జరిగేవరకు పోరాటం

అఖిలపక్ష నాయకుల సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి నాని



అఖిలపక్ష నాయకుల సమావేశంలో ప్రసంగిస్తున్న నాని

తిరుపతి(రూరల్),మార్చి7: తిరుపతి రూరల్ మండలంలోని తుమ్మలగుంట గ్రామంలో అక్రమ కట్టడాల నెపంతో కూలదోసిన ఇళ్ల యజమానులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి పులివర్తి నాని పేర్కొన్నారు. గ్రామపరిధిలో పేదల ఇళ్ల తొలగించిన ప్రాంతంలో గురువారం అఖిలపక్ష సమావేశం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బిరుదాల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ..ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ ఆపివేసి చీకటిలో పేదల ఇళ్లను నేలమట్టం చేయడం దుర్మాగచర్య అన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి పేరిట 32ఎకరాలభూమిని ఏకంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నా పట్టించుకోని మఠం అధికారులు, పేదల ఇళ్లను తొలగించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తన సతీమణి పేరుతో ఉన్న భూమికి మధ్యలో ఉన్న పేదల ఇళ్లను కూల్చివేస్తే షాపింగ్ కాంప్లెక్స్ కమర్షియల్ బిల్డింగ్స్ నిర్మించవచ్చన్న ఆలోచనతో ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఈ దురాగతానికి ఒడిగట్టారని విమర్శించారు. భూబాధితులగోడును చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఆయన ద్వారా న్యాయం జరిగేలా ప్రకటన చేయిస్తానని భరోసా ఇచ్చారు. బీజేపీ ఇన్‌చార్జి మేడసాని పురుషోత్తంనాయుడు,సీపీఐ నాయకుడు చిన్నం పెంచలయ్య, సీపీఎం నాయకుడు నాగరాజు మాట్లాడుతూ మఠం భూముల్లో పేదలను శిక్షిస్తున్నారే తప్ప భూమాఫియాని పట్టించుకోవడం లేదని ఆరోపించారు.జనసేన ఇన్‌చార్జి మనోహర్ మాట్లాడుతూ మఠం అధికారులు, ఆర్డీవో, పోలీసులపై ఇప్పటికే జాతీయ హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కి ఈమెయిల్ పెట్టామని తెలిపారు. వైసీపీ మాజీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గ ప్రజలు తమ ఓటు ద్వారా భూరాక్షసుడ్ని చంద్రగిరి నుంచి తరిమేయాలని, దేవుడి పేరును సైతం అడ్డుపెట్టుకుని దందా చేస్తున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు మురళి మాట్లాడుతూ ఇళ్లను కూలదోయడంలో ఎమ్మెల్యే పాత్ర ముఖ్యమని ఆరోపించారు. ఆర్‌పీఐ నాయకుడు అంజయ్య మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగేవరకు అండగా ఉంటామని, తొలగించిన స్థానంలోనే బాధితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా నష్టపోయిన పేదలకు న్యాయం చేసేందుకు అఖిలపక్ష కమిటీని ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా అంజయ్యను నియమించారు.

● గోడు వెళ్లబోసుకున్న వృద్ధ దంపతులు

ఎమ్మెల్యే చెవిరెడ్డి తమ్ముడు హనుమంతరెడ్డి వద్ద 2012 జనవరిలో ఈ భూమిని కొనుగోలు చేశామని, తమ డబ్బుతో ఆయనే దగ్గరుండి ఇల్లు నిర్మించి ఇచ్చారని వృద్ధదంపతులు పి.సత్యనారాయణ(71), పి.సీతామహలక్ష్మి (68) అఖిలపక్ష నాయకుల ఎదుట వాపోయారు. తాము ఊర్లోలేని సమయంలో ఇల్లు నేలమట్టం చేశారని కన్నీటి పర్యంతమయ్యారు.36అంకణాల స్థలంలో అప్పట్లోనే రూ.4.6లక్షలు వ్యయం చేశామని, ఇంటిపన్ను, విద్యుత్‌మీటరు కూడా పొందామని వివరించారు. న్యాయం జరిగేలా చూడా అఖిలపక్షనేతలను కోరారు. అదేవిధంగా డి.ప్రతిభ(భర్త దుర్గేష్)కూడా 2012లో చెవిరెడ్డి హనుమంతరెడ్డి వద్ద 42అంకణాలస్థలాన్ని కొనుగోల్లు చేసి ఇల్లు నిర్మించుకోగా ఈమె ఇంటిని కూడా తొలగించారు.

జనసేన ప్రచారానికి ఎన్‌ఆర్‌ఐ దాతృత్వం

30ఇన్నోవా వాహనాలను సమకూర్చిన ఉదయభాస్కర్



తిరుపతి అర్బన్, మార్చి 7: అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డ కొట్టే ఉదయభాస్కర్ జనసేన ప్రచారానికి 30ఇన్నోవా వాహనాలను అందజేశారు.తిరుపతిలోని అలిపిరి మార్గంలో ఈ వాహనాలకు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ ఈ వాహనాలను జనసేన పోటీ చేసే నియోజకవర్గాల్లో ప్రచారానికి వినియోగిస్తామన్నారు.జనసేన చిత్తూరుజిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, అధికార ప్రతినిధి కీర్తన, జిల్లా కార్యదర్శులు ఆనంద్, అరుణ, బాటసారి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా వైసీపీ బూత్ కన్వీనర్ల సమావేశం



సురేష్‌ను వేదికపైకి రావాలని కోరుతున్న రాజేష్

వరదయ్యపాళెం, మార్చి 7: వరదయ్యపాళెంలో గురువారం నిర్వహించిన వైసీపీ బూత్ కన్వీనర్ల సమావేశం రసాభాసగా మారింది. ఆర్‌ఆర్ కళ్యాణ మండపంలో సత్యవేడు, నాగలాపురం, బీఎన్‌కండ్రిగ మండలాలకు చెందిన వైసీపీ బూత్ కన్వీనర్లతో ఆపార్టీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బత్తలవల్లంకు చెందిన బూత్‌కన్వీనర్ గజేంద్ర పేరును తొలగించి మరో కొత్తపేరును చేరచ్చడంపై వివాదం రాజుకుంది. పార్టీకి కష్టపడి పనిచేస్తున్న తన పేరును ఉన్నపళంగా తొలగించి కొత్త పేరును ఎలా చేరుస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆపార్టీ నాయకుడు గిరిరెడ్డి, గజేంద్ర మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇరువురు మధ్య తోపులాట చోటుచేసుకుంది. మండల నాయకులు కలుగజేసుకుని సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా, సమావేశం ప్రారంభంలోనే ఎస్సీసెల్ మండల కన్వీనర్ బందిల సురేష్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, అసలు కార్యక్రమాలకు సైతం సరైన సమాచారం ఇవ్వడం లేదంటూ రాజేష్ సమక్షంలోనే నాయకులపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ వేదిక కింద కూర్చున్నారు. ఈ పరిణామంతో కంగుతిన్న పార్టీ సమన్వయ కర్త రాజేష్ వేదిక నుంచి కిందదిగి సురేష్ దగ్గరకు వచ్చారు. వేదికపైకి రావాలంటూ ఆయనకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి మూడు మండలాల నాయకులు అతికొద్ది మంది మాత్రమే హాజరుకావడం గమనార్హం.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చిల్లకూరు మండలం ఏరూరు సముద్రతీర ప్రాంతంలో మంచాల సనత్‌కుమార్ రూపొందించిన మహిళ సైకత శిల్పమిది. - చిల్లకూరు

బలిజ కులస్తులంటే సీఎంకు గిట్టదు

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి అర్బన్, మార్చి 7 : బలిజ కులస్తులంటే సీఎం జగన్‌కు గిట్టదని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. గురువారం ఉదయం తిరుపతిలోని అలిపిరి మార్గంలో జనసేన పార్టీకి ఎన్‌ఆర్‌ఐ ఉదయభాస్కర్ సమకూర్చిన ప్రచార వాహనాల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రెడ్డి కులానికి చెందిన ఎమ్మెల్యేలు ఏడాది క్రితమే వైసీపీని విడిచిపెట్టినా సస్పెండ్ చేయలేదని, కేవలం బలిజ కులస్తుడిని కాబట్టే తనపట్ల చిన్నచూపు చూశారని దుయ్యబట్టారు. బలిజలు వైసీపీకి ఓటు వేయరని సీఎం, ఆయన కోటరీ అభిప్రాయమన్నారు.రాయలసీమలో 2019లో బలిజ కులానికి కేవలం రెండు నియోజకవర్గాల్లోనే అవకాశం ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో అవి కూడా లేవంటే బలిజల పట్ల వైసీపీకున్న అభిమానం ఏపాటిదో అర్థమవుతుందన్నారు. తాను తిరుపతిలో పోటీచేసే అంశం జనసేనాని పవన్‌కల్యాణ్ పరిశీలిస్తారని, అధిష్ఠానం నిర్ణయం మేరకు నడుచుకుంటానని స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు పరాశరేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



పరాశరేశ్వరస్వామి ఆలయం - లోపల ఏర్పాటు చేసిన క్యూలైన్లు

తిరుచానూరు, మార్చి 7: తిరుచానూరు యోగిమల్లవరంలోని పరాశరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని శీఘ్రదర్శనం, ఉచిత దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.అన్నదాన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం వేకువ జామున 2.30గంటలకు ప్రత్యేక అభిషేకం,రాత్రి 10గంటల నుంచి నాలుగు పర్యాయాలు రుద్రాభిషేకం జరగనున్నట్లు సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.ఆదివారం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవ కార్యక్రమం జరగనుందని భక్తులు టిక్కెట్టు కొనుగోలు చేసి పాల్గొనవచ్చని తెలిపారు.

సిద్దార్థ ఇంజనీరింగ్‌లో క్యాన్సర్‌పై అవగాహన



తిరుపతి(రూరల్),మార్చి7: తిరుపతి రూరల్ మండలంలో సి.గొల్లపల్లెలో ఉన్న సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్‌సెల్ , ఐఐసీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్, ఇ-యువస్కీమ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన బాలాజి మెడికల్ కళాశాల డాక్టర్ వికాస్ శంకర్ మాట్లాడుతూ మహిళలకు వచ్చే పలురకాల క్యాన్సర్ల రక్షణకు అవసరమైన వ్యాక్సీన్లను వివరించారు. డాక్టర్ కళారాణి మాట్లాడుతూ ఇంటర్ డిసిప్లనరీ కోర్సులను ఎంపిక చేసుకునే విధానాన్ని వివరించారు. చైర్మన్ వై.కొండారెడ్డి, సెక్రటరీ, వై.ఆనందరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ వై.విజయ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, ఉమెన్‌ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ వీకే మధు స్మితరాణి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ బి.నారాయణబాబు, ఐఐసీ ప్రెసిడెంట్ డాక్టర్ టి.సుజిత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమష్టికృషితోనే టీడీపీ విజయం సాధ్యం

రామచంద్రాపురం, మార్చి 7: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టికృషితోనే టీడీపీ విజయం సాధ్యమవుతుందని టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కోరా హరిప్రసాద్, మహేష్‌నాయుడు అన్నారు. గురువారం మిట్టకండ్రిగ పంచాయతీలో సూపర్‌సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు సురేంద్రనాయుడు, చిరంజీవి, వీరారాఘవులు, పద్మనాభం తదితరులు పల్గొన్నారు.



సూపర్‌సిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



గాయని పి. సుశీలకు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

లింగ సమానత్వంతోనే
దేశానికి విశ్వ గురుస్థానం

పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7:లింగ సమానత్వం సాధించడం ద్వారానే మన దేశం విశ్వ గురువుగా నిలవడానికి అవకాశం కలుగుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ లింగ సమానత్వమనేది మహిళా సాధికారతకు సంబంధించిన అంశం మాత్రమే కాదనీ, ఇది దేశాభివృద్ధితోనూ ముడిపడి ఉన్న విషయమని చెప్పారు. లింగ సమానత్వపు అంతిమ లక్ష్యం స్త్రీ, పురుషులు సమాన హక్కులు పొందడమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పద్మావతి యూనివర్సిటీ దోహదం చేస్తోందని కితాబిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో రిటైర్డు శాస్త్రవేత్త మంగళమణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా తాము ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం మహిళలకు ఉంటుందన్నారు.తాను టెక్నాలజీ వైపు ఆసక్తి పెంచుకోవడానికీ, ఇస్రో శాస్త్రవేత్తగా రాణించడానికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, దేవుడి దయతో పాటు ఆత్మ స్థైర్యం చాలా ఉపయోగపడిందన్నారు.అంటార్కిటిక్ ఎక్స్‌పెడిషన్ కోసం 400 రోజుల ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని గుర్తు చేసుకున్నారు.ఓ మహిళగా ఈ సమస్యలన్నింటినీ ఆత్మ స్థైర్యంతోనే పరిష్కరించుకున్నానన్నారు.వీసీ ప్రొఫెసర్ భారతి, మాట్లాడుతూ పి.సుశీల వంటి అద్వితీయమైన గాయనికి గౌరవ డాక్టరేట్ అందించడం మహిళా యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ తరం విద్యార్థినులు సుశీల చేసిన కృషి నుంచీ స్ఫూర్తి పొందాలని సూచించారు. మహిళాభివృద్ధిలో నాలుగు దశాబ్దాలుగా తన వంతు కృషి చేస్తున్న పద్మావతి వర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని బోధన, పరిశోధనల్లో పరస్పరం సహకరించుకుంటున్నట్టు తెలిపారు.అనంతరం ప్రముఖ గాయని పి. సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్, ధృవీకరణ పత్రం, జ్ఞాపికతో సుశీలను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. సైన్స్ విద్యార్థినులు 30మంది, ఆర్ట్స్ విద్యార్థినులు 21మంది, ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరుగురు బంగారు పతకాలు స్వీకరించగా 12 మంది ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు పుస్తక బహుమతులు అందుకున్నారు. నలుగురు ఆర్ట్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు నగదు బహుమతులు పొందారు.పీహెచ్‌డీలు 86మందికి, ఇద్దరికి ఎంఫిల్, పీజీ పట్టాలు 771మందికి, డిగ్రీ పట్టాలు 872మందికి, దూరవిద్యకు సంబంధించిన డిగ్రీలు 72మందికి, పీజీ పట్టాలు 50 మందికి అందజేశారు.

త్యాగానికి ప్రతిరూపం స్త్రీ



మహిళా ఉద్యోగికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీపీటీవో

తిరుపతి అర్బన్, మార్చి 7 : మహిళలు త్యాగానికి ప్రతి రూపాలని ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజారవాణాధికారి కార్యాలయంలో గురువారం ఆర్టీసీ మహిళా ఉద్యోగులతో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విన్స్ సంస్థ డైరెక్టర్ ఆర్.మీరా హాజరయ్యారు. ఆమెను ఘనంగా సత్కరించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులు చాందిని, గీత, జయంతి, సరస్వతి, కోమలమ్మను సన్మానించారు. ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, పీవో పార్థసారథి, పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి, ఆర్టీసీ సంఘాల నేతలు సత్యనారాయణ, శివకుమార్, గురునాథం, పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడిని జయించొచ్చు



ఉద్యోగులతో కలిసి యోగా చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్, మార్చి 7 : మానసిక, శారీరక ఆరోగ్యం కోసం ప్రతి ఉద్యోగీ రోజుకు గంటపాటు యోగా చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. గురువారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో కలెక్టరేట్ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు దైనందిన జీవితంలో ఉద్యోగ, కుటుంబ రీత్యా మానసిక ఒత్తిడికి గురవుతుంటారని, వాటిని అధిగమించాలంటే రోజు ఉదయం 6-7గంటల మధ్య యోగా, ధ్యానం చేయాలని సూచించారు. ఆహారపు అలవాట్లపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీలు భాస్కర్ నాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, మురళి పాల్గొన్నారు.

తిరుపతి

స్త్రీ శక్తి అనంతం : అనంతలక్ష్మి

● పలువురికి పద్మావతి పురస్కారాలు





తిరుపతి (కల్చరల్), మార్చి 7: భారతీయ సమాజంలో స్త్రీకి ఉన్నత స్థానం ఉందని, ఆమె శక్తి అనంతమైందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి అన్నారు. గురువారం తిరుపతి మహతి వేదికలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆమె మాట్లాడుతూ భారతావనిలో మహిళలు రాజ్యపాలనతోపాటు అనేక రంగాలలో శక్తి చాటుకున్న సందర్భాలున్నాయన్నారు. నేడు యుద్ధరంగం నుంచి అంతరిక్ష యానం వరకు మహిళ ప్రమేయం లేని రంగం ఏదీ లేదన్నారు. టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ పురాణాల ప్రకారం ఆది దేవత మహిళేనన్నారు. చరిత్రలో ఎందరో మహిళలు రాజ్యపాలన చేశారన్నారు. భారతీయ సమాజం తొలుత మాతృస్వామ్యమేనని గుర్తు చేశారు. అనంతరం టీటీడీలోని వివిధ విభాగాలలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న డిప్యూటి ఈవో స్నేహలత, ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఉమా ముద్దుబాల, సప్తగిరి పత్రిక ఉప సంపాదకురాలు డాక్టర్ అల్లాడి సంధ్య, అధ్యాపకురాలు డాక్టర్ సుజాతమ్మ, సూపరింటెండెంట్లు మల్లీశ్వరి, ఇందిర, చీఫ్ పీఆర్‌వో కార్యాలయ అసిస్టెంట్ సుగుణ తదితరులను పద్మావతి అవార్డులతో సత్కరించారు. పద్మశ్రీ పొందిన తొలి మహిళా మృదంగ కళాకారిణి దండమూడి సుమతి, గాత్ర కళాకారిణి ద్వారం లక్ష్మి, ఆసియా క్రీడల పతక విజేత అథ్లెట్ నందిని అగసార, తిరుపతికి చెందిన సామాజిక సేవకురాలు శోభారాణి, టీటీడీకి చెందిన మహిళా క్షురకురాలు గీత, ఆరోగ్య శాఖ ఉద్యోగి సుభాషిణి, ముద్రణాలయ ఉద్యోగి భాగ్యవతి, ఎస్వీ డోలు పాఠశాల నాదస్వర విభాగాధిపతి రవిప్రభను టీటీడీ తరఫున ఈవో ధర్మారెడ్డి, భూమన సత్కరించారు. టీటీడీ మహిళా ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ కృష్ణవేణి, ఏపీ ఆర్వో పి.నీలిమ నిర్వహించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

● 144 గ్రాముల బంగారు నగల స్వాధీనం



నిందితుడిని, నగలను చూపుతున్న డీఎస్పీ సురేంద్రరెడ్డి

తిరుపతి క్రైం, మార్చి7 : నగరంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను గురువారం తిరుపతి పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి రూ.8 లక్షల విలువచేసే 144 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సురేంద్రరెడ్డి కథనం మేరకు.. జీవకోన నవజీవన్ కాలనీకి చెందిన వరదరాజులు మణి జులాయిగా తిరుగుతూ దొంగతనాలకు అలవాటుపడ్డాడు. అలిపిరి, ఎస్వీ యూనివర్సిటీ, తిరుచానూరు స్టేషన్ల పరిధిలో దాదాపు 10 ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. క్రైం అదనపు ఎస్పీ విమల కుమారి పర్యవేక్షణలో డీఎస్పీ సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. తిమ్మినాయుడుపాళెం బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసి వరదరాజులు మణి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో అంగీకరించాడు. అతని నుంచి 144 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. పీడీ యాక్టు నమోదు చేస్తామని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐ, పోలీసులకు రివార్డులు ప్రకటించారు.

బీసీ డిక్లరేషన్‌పై రజకుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న రజక సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 7 : తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ పట్ల ఉమ్మడి చిత్తూరు జిల్లా రజక సంక్షేమ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో రాజయ్య, శంకర్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో రజకుల అభ్యున్నతికి పెద్దపీట వేసిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దోబీఘాట్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దాటిన వారికి రూ.నాలుగు వేలు పింఛన్ మంజూరు చేస్తామని చెప్పడం హర్షణీయమన్నారు. తిరుమలలో బట్టలు ఉతికే కేంద్రాన్ని నిర్మించి, రజకులకు ఉపాధి కల్పించాలని కోరారు. లేనిపక్షంలో రజకులకే కాంట్రాక్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దోబీఘాట్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. రజకులకు చట్టసభల్లో పది సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్‌కుమార్, చంద్ర, వెంకటముని, శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

అబూబకర్ షాదీమహల్ ఆధునికీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం సంఘ నేతలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 7: ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని అబూబకర్ షాదీమహల్‌ను ఆధునికీకరిస్తున్నామని, ఇందులో భాగంగా నూతనంగా నిర్మించిన భోజనశాలను ఈనెల 9వ తేదీన ప్రారంభించనున్నామని తిరుపతి ముస్లిం సంఘాల నాయకులు షేక్‌ఇమామ్ సాహెబ్, ఖాదర్‌బాషా తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రూ.80 లక్షలతో నిర్మించిన భోజనశాలను శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ముస్లింలందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముస్లిం నాయకులు గఫూర్, షాన్‌బాషా, మహ్మద్ ఖాసిం, దాదా ఇమ్రాన్, వజీర్‌బాషా పాల్గొన్నారు.

రూ.67 కోట్లు పాత బకాయిల వసూలు



జయచంద్రారెడ్డి

తిరుపతి(ఆటోనగర్) మార్చి7 : తిరుపతి టౌన్ బ్యాంక్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో రూ.67 కోట్ల పాత బకాయిలు వసూలు చేశామని ఆ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను బాధ్యతలు తీసుకునే సమయానికి 23.7శాతం పాత బకాయిలు ఉన్నాయన్నారు. ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి, ఇప్పటివరకు రూ.67 కోట్లు వసూలు చేసి, బకాయిల శాతాన్ని 5.83 శాతానికి తగ్గించామని వెల్లడించారు. మిగిలిన బకాయిలనూ వసూలు చేసి, బ్యాంక్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తామన్నారు. మరో ఐదు శాఖల్లో ఏటీఎంల ఏర్పాటుకు, రుణ పరిమితి రూ.30లక్షలకు పెంపునకు కృషి చేస్తామని వెల్లడించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు

తిరుమల, మార్చి7(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,887 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,532 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల,మార్చి7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.వారిలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, భరత్, టీడీపీ నేత గౌనివారి శ్రీనివాసులు, తమిళ నటుడు శశికుమార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.కోటి విరాళం



తిరుమల, మార్చి7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.కోటి విరాళంగా అందింది.విశాఖ పట్టణానికి చెందిన మస్తాన్‌రావు, రేఖ ఈ విరాళాన్ని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

శ్రీవారిమెట్టు మార్గంలో విశాఖ భక్తుడి మృతి

తిరుమల, మార్చి7(ఆంధ్రజ్యోతి):తిరుమల నడకమార్గాల్లో ఒకటైన శ్రీవారిమెట్టు మార్గంలో గురువారం ఓ భక్తుడు మృతిచెందాడు. విశాఖకు చెందిన సతీష్(50) కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం తిరుపతికి చేరుకున్నారు. మొక్కు వుండడంతో శ్రీవారిమెట్ల మార్గంలో తిరుమలకు నడకను ప్రారంభించారు. మార్గమధ్యంలో సతీష్ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే సతీష్ గుండెపోటుతో మృతి చెందినట్టు తెలిపారు.కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు పోలీసులు టీటీడీ అంబులెన్స్‌లో విశాఖకు మృతదేహాన్ని పంపించారు.



గాయని పి. సుశీలకు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

లింగ సమానత్వంతోనే దేశానికి విశ్వ గురుస్థానం

పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7:లింగ సమానత్వం సాధించడం ద్వారానే మన దేశం విశ్వ గురువుగా నిలవడానికి అవకాశం కలుగుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ లింగ సమానత్వమనేది మహిళా సాధికారతకు సంబంధించిన అంశం మాత్రమే కాదనీ, ఇది దేశాభివృద్ధితోనూ ముడిపడి ఉన్న విషయమని చెప్పారు. లింగ సమానత్వపు అంతిమ లక్ష్యం స్త్రీ, పురుషులు సమాన హక్కులు పొందడమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పద్మావతి యూనివర్సిటీ దోహదం చేస్తోందని కితాబిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో రిటైర్డు శాస్త్రవేత్త మంగళమణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా తాము ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం మహిళలకు ఉంటుందన్నారు.తాను టెక్నాలజీ వైపు ఆసక్తి పెంచుకోవడానికీ, ఇస్రో శాస్త్రవేత్తగా రాణించడానికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, దేవుడి దయతో పాటు ఆత్మ స్థైర్యం చాలా ఉపయోగపడిందన్నారు.అంటార్కిటిక్ ఎక్స్‌పెడిషన్ కోసం 400 రోజుల ప్రయాణంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నానని గుర్తు చేసుకున్నారు.ఓ మహిళగా ఈ సమస్యలన్నింటినీ ఆత్మ స్థైర్యంతోనే పరిష్కరించుకున్నానన్నారు.వీసీ ప్రొఫెసర్ భారతి, మాట్లాడుతూ పి.సుశీల వంటి అద్వితీయమైన గాయనికి గౌరవ డాక్టరేట్ అందించడం మహిళా యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ తరం విద్యార్థినులు సుశీల చేసిన కృషి నుంచీ స్ఫూర్తి పొందాలని సూచించారు. మహిళాభివృద్ధిలో నాలుగు దశాబ్దాలుగా తన వంతు కృషి చేస్తున్న పద్మావతి వర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని బోధన, పరిశోధనల్లో పరస్పరం సహకరించుకుంటున్నట్టు తెలిపారు.అనంతరం ప్రముఖ గాయని పి. సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్, ధృవీకరణ పత్రం, జ్ఞాపికతో సుశీలను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. సైన్స్ విద్యార్థినులు 30మంది, ఆర్ట్స్ విద్యార్థినులు 21మంది, ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరుగురు బంగారు పతకాలు స్వీకరించగా 12 మంది ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు పుస్తక బహుమతులు అందుకున్నారు. నలుగురు ఆర్ట్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు నగదు బహుమతులు పొందారు.పీహెచ్‌డీలు 86మందికి, ఇద్దరికి ఎంఫిల్, పీజీ పట్టాలు 771మందికి, డిగ్రీ పట్టాలు 872మందికి, దూరవిద్యకు సంబంధించిన డిగ్రీలు 72మందికి, పీజీ పట్టాలు 50 మందికి అందజేశారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చిల్లకూరు మండలం ఏరూరు సముద్రతీర ప్రాంతంలో మంచాల సనత్‌కుమార్ రూపొందించిన మహిళ సైకత శిల్పమిది. - చిల్లకూరు

'పామాయిల్'తో అధిక లాభాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి7: పామాయిల్ సాగుతో అధిక లాభాలు వస్తాయని ఉద్యాన శాఖాధికారి యామిని తెలిపారు. గురువారం 3ఎఫ్ ఆయిల్ కంపెనీ అధికారితో కలసి మండలంలోని కారణి గ్రామంలో తొలిసారిగా పామాయిల్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ పంట దిగుబడి 30 ఏళ్లపాటు ఉంటుందన్నారు. ఎకరాకు 57 మొక్కలు నాటాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి నాలుగేళ్లకు రూ.69వేల సబ్సిడీ వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారి మురళి, ఏరియా మేనేజర్ రాజేష్, క్లస్టర్ ఆఫీసర్ ఆనందబాబు, రైతులు శిఖామణి, మస్తాన్ నాయుడు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తొట్టంబేడు, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సెట్ప్స్ సంస్థ పథక సంచాలకురాలు డాక్టర్ ప్రమీలమ్మ పిలుపునిచ్చారు. దిగువసాంబయ్యపాళెంలో ముందస్తు మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ప్రొటీన్ పౌడర్, గ్లూకోజ్ ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ సుధాకర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే తొట్టంబేడు పంచాయతీ చిలకావారి కండ్రిగలో డెంగ్యూ ఫీవర్ ఉండడంతో మెడికల్ ఆఫీసర్ సాయిపూజ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు శివకుమార్, ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, ఏఎన్ఎం సుధా, సిబ్బంది పాల్గొన్నారు.

సిపాయి భరోసా అందజేత

తొట్టంబేడు, మార్చి 7: శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడులో సాంబశివయ్య, సుందరరామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం.. సిపాయి భరోసా కింద 40రకాల నిత్యావసర వస్తువులను వారి కుటుంబానికి గురువారం అందజేశారు. అనంతరం వైసీపీలో చేరిన మాదవగిరి గ్రామస్తులు కొందరికి పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, దేవ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్టాండుకు వేలంపాట

ఏర్పేడు, మార్చి 7: పాపానాయుడుపేటలో గురువారం సర్పంచ్ మేకళత్తూరు లలితా కరుణాకర్ అధ్యక్షతన ప్రైవేటు బస్టాండు, దినసరి కూరగాయల మార్కెట్, దుకాణ సముదాయాలకు వేలంపాట నిర్వహించారు. బస్టాండు, దినసరి కూరగాయలు మార్కెట్ రూ.2,37,900, షాపింగ్ కాంప్లెక్సులు రూ.7,61,400, మొత్తం రూ.9,90,300 పంచాయతీకి ఆదాయం వచ్చింది. అధికారులు ప్రభురెడ్డి, హరికృష్ణ, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

శ్రీకాళహస్తి, మార్చి 7: బీజేపీ నాయకులు గురువారం కోలా ఆనంద్‌కు మద్దతుగా పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో బహదూర్‌పేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అసెంబ్లీ కోకన్వీనర్ సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కార్యదర్శి బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షుడు గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దు వాసు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



మునిరత్నం (ఫైల్ ఫొటో)

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 7: బుచ్చినాయుడుకండ్రిగ మాజీ ఎంపీపీ బండారు మునిరత్నం(53) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. పెద్దపాడు పంచాయతీలోని సప్తగిరి గిరిజన కాలనీలో ఆమె మృతదేహానికి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సునీత, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి సముద్రాల సుధాకర్‌నాయుడు, మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, సత్యవేడు నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వేదాం వెంకటచలం తదితరులు పుష్పాంజలి ఘటించారు.

పళ్లికొండేశ్వరాలయంలో నేడు మహాశివరాత్రి వేడుకలు



నాగలాపురం, మార్చి 7: సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సాధారణంగా అన్ని ఆలయాల్లో శివుడు లింగాకారంలో దర్శనమిస్తారు. ఇక్కడ మాత్రం పరమశివుడు రూపాకారంలో దర్శనమివ్వడంతో పలు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈ ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు.

కాంతులీనుతున్న ఆలయం: పళ్లికొండేశ్వరాలయం విద్యుత్ దీపాలంకరణలతో కాంతులీనుతోంది. ఎన్నడూ లేనివిధంగా లోపల, బయట, ఆలయానికి ఇరువైపులా సుమారు కిలోమీటరు మేరకు చెన్నై-తిరుపతి జాతీయ రహదారి పక్కన భారీ ఎత్తున స్వామి, అమ్మవార్ల దేవతా మూర్తుల విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేశారు.



శివయ్య సేవ.. పూర్వజన్మ సుకృతం

యోగనిద్రా మూర్తి శివయ్యకు సేవ చేయడం పూర్వజన్మ సుకృతం. గంటకు 1000 మంది భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశాం. బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలి.

- ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడి

అశ్వవాహనంపై పరమేశ్వరుడి విహారం



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

నాగలాపురం, మార్చి 7: సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పరమేశ్వరుడు అశ్వ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఉత్సవాల సందర్భంగా ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజలకు తమిళనాడు ఊత్తుకోటకి చెందిన ఎంఆర్ తమిళరశి, టీఆర్ మోహన్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుక్కల్, చైర్మన్ పాల్గొన్నారు.

బీసీలను ఆదుకునేది టీడీపీ ప్రభుత్వమే



కేవీబీపురం మార్చి7: బీసీలను ఆదుకునేది టీడీపీ ప్రభుత్వమేనని పార్టీ మండల అధ్యక్షుడు రామాంజుల నాయుడు తెలిపారు. గురువారం అంజూరు, గుంటిపేడు, సూరమాల, కండ్లూరు పంచాయితీల్లో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గోపీనాథ్ రెడ్డి, మునిశంకర్, సురేష్, పావని, గోపిరెడ్డి, ముఖేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రమేష్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడును మరింత అభివృద్ధి చేస్తా: బొజ్జల



ఏర్పేడు, మార్చి 7: 'మాజీ సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏర్పేడు మండలం ఇప్పటికే అభివృద్ధి చెందింది. టీడీపీ అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా' అని శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పల్లం పంచాయతీ పల్లంపేటలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, రమణప్పనాయుడు, నాగేశ్వరరావు, రాజకుమార్‌నాయుడు, చెంచయ్యనాయుడు, గురవారెడ్డి, అశ్వద్ధామ, కుక్క రమణయ్య, పేరం ధనంజయులునాయుడు, పొన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రానున్నది రామ రాజ్యమే : హెలెన్

సత్యవేడు, మార్చి 7: చంద్రబాబు ఆధ్వర్యంలో రానున్నది రామరాజ్యమేనని సత్యవేడు టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ తెలిపారు. పేరడంలో గురువారం సాయంత్రం క్లస్టర్ ఇన్‌చార్జి శివ కుమార్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. హెలెన్ ఇంటింటికీ వెళ్లి బాబు సూపర్ సిక్స్ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. నాయకులు నరేంద్ర, వినాయగం, ఈశ్వరయ్య, వెంకటేశ్వరులు, జగన్నాథం, పృథ్వి, సంతోష్, తులసి, దయానిధి, వెంకటేషన్, కార్తీక్, ఆర్ముగం, దేవేంద్ర, ముద్దుకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే దళితుల అభివృద్ధి



తొట్టంబేడు, మార్చి 7: దళితులు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్రకార్యదర్శి గాదిపాకుల గోపీనాథ్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని టీఎంవీ కండ్రిగ, చెర్లోపల్లి, తొండమనాడు దళితవాడల్లో దళిత శంఖారావం కార్యక్రమం గురువారం నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ ఎస్సీసెల్ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, ప్రధానకార్యదర్శి భాస్కర్, నాయకులు గున్నయ్య, సుబ్బు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత నిధుల జమ

మహిళల ఖాతాల్లోకి రూ.210.82కోట్లు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద గురువారం నాలుగో విడత నిధులు జమ చేసింది. అనకాపల్లి జిల్లా నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నిధులను జమ చేయగా కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్, లబ్ధిదారులు హాజరయ్యారు. జిల్లాలో 1,12,436మంది లబ్ధిదారులకు రూ.210.82కోట్లు జమ చేసినట్లు జేసీ తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

అమర రాజాలో మాక్‌డ్రిల్ విజయవంతం



రేణిగుంట, మార్చి 7: నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో గురువారం రాష్ట్రవ్యాప్తం మాక్‌డ్రిల్ లో భాగంగా గురువారం కరకంబాడిలోని అమరరాజా ఎనర్జీ అండ్‌మొబిలిటీ పరిశ్రమలో అసిటిలిన్ గ్యాస్ లీకేజీపై మాక్‌డ్రిల్ విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఫైర్ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరరాజా మేనేజరు నందికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా వైసీపీ బూత్ కన్వీనర్ల సమావేశం



సురేష్‌ను వేదికపైకి రావాలని కోరుతున్న రాజేష్

వరదయ్యపాళెం, మార్చి 7: వరదయ్యపాళెంలో గురువారం నిర్వహించిన వైసీపీ బూత్ కన్వీనర్ల సమావేశం రసాభాసగా మారింది. ఆర్ఆర్ కళ్యాణ మండపంలో సత్యవేడు, నాగలాపురం, బీఎన్‌కండ్రిగ మండలాలకు చెందిన వైసీపీ బూత్‌కన్వీనర్లతో ఆపార్టీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బత్తలవల్లంకు చెందిన బూత్‌కన్వీనర్ గజేంద్ర పేరును తొలగించి మరో కొత్తపేరును చేరచ్చడంపై వివాదం రాజుకుంది. పార్టీకి కష్టపడి పనిచేస్తున్న తన పేరును ఉన్నపళంగా తొలగించి కొత్త పేరును ఎలా చేరుస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆపార్టీ నాయకుడు గిరిరెడ్డి, గజేంద్ర మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇరువురు మధ్య తోపులాట చోటుచేసుకుంది. మండల నాయకులు కలుగజేసుకుని సర్దిచెప్పారు. ఇదిలా ఉండగా, సమావేశం ప్రారంభంలోనే ఎస్సీసెల్ మండల కన్వీనర్ బందిల సురేష్ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని, అసలు కార్యక్రమాలకు సైతం సరైన సమాచారం ఇవ్వడం లేదంటూ రాజేష్ సమక్షంలోనే నాయకులపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ వేదిక కింద కూర్చున్నారు. ఈ పరిణామంతో కంగుతిన్న పార్టీ సమన్వయ కర్త రాజేష్ వేదిక నుంచి కిందదిగి సురేష్ దగ్గరకు వచ్చారు. వేదికపైకి రావాలంటూ ఆయనకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, తిలక్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా.. సమావేశానికి మూడు మండలాలకు చెందిన నాయకులు అతికొద్ది మంది మాత్రమే హాజరుకావడం గమనార్హం.

అంగన్‌వాడీలకు శ్రీసిటీ పరిశ్రమల వితరణ

శ్రీసిటీ, మార్చి 7: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా గురువారం పలు అంగన్‌వాడీ కేంద్రాలకు 3.5 లక్షల విలువైన విద్యాసామగ్రిని పంపిణీచేశాయి. శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ గ్రూప్(ఎస్‌జేసీజీ) ఆధ్వర్యంలో మల్లవారిపాళెం వెస్ట్, తొండూరు సొసైటీ, మాధనపాళెం, రామచంద్రాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు 2 లక్షల విలువైన ఎల్‌ఈడీ టీవీ, అల్మారా, స్టూడెంట్ చైర్లు, ఆట వస్తువులు, గ్యాస్ స్టౌవ్, కుక్కర్ తదితర పరికరాలను, ప్రికాల్ పరిశ్రమ ద్వారా 1.5 లక్షల విలువైన రెండు ఇండక్షన్ స్టౌవ్‌లు, రెండు ఎల్‌ఈడీ టీవీలు, కుర్చీలు, భోజన ప్లేట్లు, ఇతర ఆట వస్తువులను అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు.

సిద్ధేశ్వరాలయంలో చండీ హోమం

ఏర్పేడు, మార్చి 7: చిందేపల్లెలోని పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో నవచండీహోమం నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం జరిగింది. ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి, చిందేపల్లె సర్పంచ్ చెన్నూరు పెంచలయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా తపస్య పాఠశాల వార్షికోత్సవం



రేణిగుంట, మార్చి 7: పట్టణంలోని తపస్య మూడో వార్షికోత్సవాన్ని గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుపతి అర్బన్ హట్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసరా చెక్ పంపిణీ



రేణిగుంట, మార్చి 7: రేణిగుంట మండలానికి చెందిన వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం నిర్వహించారు. వైసీపీ మండల ఇన్‌చార్జి పవిత్రారెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు రూ.11,37,48,000 మెగాచెక్కును అందజేశారు. వైస్ ఎంపీపీ సుజాత,ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలు అవగాహన కలిగిఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జానకి

పుత్తూరు టౌన్, మార్చి 7: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల సంక్షేమ వసతి గృహంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారిక కొనసాగాలంటే విద్యార్థి దశ నుంచి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, సాధించుకోవాలన్నారు. మహిళల రక్షణ చట్టాలు, లింగ నిర్ధారణ నిషేధ చట్టం, భ్రూణ హత్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి భాను, హరిప్రియ, వసతి గృహ అధికారి జయసుధ, ఉపాధ్యాయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన

పుత్తూరు, మార్చి 7: మండలంలోని గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాలలో బాలికలకు ఆరోగ్య సమస్యల మీద కేకేసీ హోమియో వైద్య కళాశాలకు చెందిన మహిళా డాక్టర్లు అవగాహన కల్పించారు. రుతుసమస్యలు, లైంగిక విద్య, శారీరక శుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించి హోమియో మందులు పంపిణీ చేశారు. కళాశాల చైర్మన్ కుప్పయ్యశెట్టి, ప్రిన్సిపాల్ శరవణన్, డాక్టర్లు కల్యాణి, సాహితి, గ్రీష్మ, సంగీత, నాయక్, కిషోర్, రాజేశ్వరి, శ్రావ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రభుత్వ భవనాల ప్రారంభం



పురపాలక సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న రోజా

పుత్తూరు, మార్చి 7: పుత్తూరు మండలంలో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను మంత్రి రోజా గురువారం ప్రారంభించారు. పట్టణంలోని మున్సిపాలిటీ రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్మించిన పురపాలక భవనాన్ని, పరమేశ్వరమంగళంలో సచివాలయ భవనాన్ని, తిరుమలకుప్పంలో సచివాలయం, వెల్‌నెస్, రైతు భరోసా కేంద్రాలను రోజా ప్రారంభించారు. అలాగే సబ్‌స్టేషన్‌కు భూమి పూజ చేశారు. కొత్తగా నిర్మించిన షాదీ మహల్‌లో మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఘనత టీడీపీదే: భానుప్రకాష్



భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న ఎనమలపాలెంవాసులు

వడమాలపేట, మార్చి 7: స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదేనని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని ఎనమలపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలందరూ లబ్ధిపొందేలా టీడీపీ మేనిఫెస్టో రూపొందించినట్లు వివరించారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలందరూ లబ్ధి పొందుతారని తెలిపారు. చంద్రబాబు నాయుడు మహిళలకు రుణ సౌకర్యం కల్పించి ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు కృషితో అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీలో విలీనం చేయడం ద్వారా భూముల ధరల పెరిగాయని, ఎంతోమందికి ఆర్థిక చేయూత లభిస్తోందన్నారు. ఎనమలపాలెం బీసీ కాలనీ ఏర్పాటు చేసి నిరుపేదలకు గృహవసతి కల్పించారని స్థానికులకు గుర్తుచేశారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ ఎల్లప్పుడు అండగా ఉంటానని, తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. భానుప్రకాష్‌కు మహిళలు మంగళహారుతలిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానా వెంకటయ్య, నాయకులు చినబాబు, ధనంజయులు నాయుడు, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజేష్, గురవయ్య, హేమావతి, లక్ష్మీప్రసన్న, నాగరాజు, మురళి, జనార్దన్, మహేష్, హరి, చక్రపాణి, శివశంకర్, కుమార్, జయశంకర్, రఘు, సుబ్బరామయ్య, దేవ, అంజయ్య, జనసేన నాయకులు మహేష్, మునిశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విజయబాబు నియామకం పట్ల హర్షం

పుత్తూరు అర్బన్, మార్చి 7: పట్టణానికి చెందిన పోతుగుంట విజయబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడం పట్ల ఆ పార్టీ నాయకులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి సుమన్ నాయుడు, ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ధనపాల్, పీఆర్ మంగళం ఎంపీటీసీ శ్రీజ బాలాజీ నాయుడు, నాయకులు పరంధాం, సూపర్ బజార్ చైర్మన్ చంద్రాయాదవ్, వంశీ, బాబూరాయల్, ప్రకాష్, మణి, కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేసే వ్యక్తి అరెస్టు

30గ్రాముల బంగారు, రెండు ఐ ఫోన్ల స్వాధీనం

తిరుపతి(ఆటోనగర్) మార్చి7: రైళ్లలో ఏసీ కోచ్‌లలో ప్రయాణించే వారే లక్ష్యంగా చోరీలు చేసే వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 30గ్రాముల బంగారు నగలు, రెండు ఐ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ సీఐ హేమసుందర్‌రావు, రైల్వే భద్రతా దళాల ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఆ వివరాలను మీడియాకు వివరించారు.

శివరాత్రికి ఇదేం కష్టం ముక్కంటీశా!

- కొండలా ఏర్పాటు చేసిన మెట్లెలా ఎక్కాలి?
- సామాన్య భక్తుల ఆవేదన




మూడో నెంబరు వద్ద ఏర్పాటు చేసిన మెట్లు - స్థానికులకు ఇచ్చిన టిక్కెట్

శ్రీకాళహస్తి, మార్చి 7: శ్రీకాళహస్తీశ్వరాలయానికి మహాశివరాత్రి పర్వదినాన లక్షన్నర మందికిపైగా భక్తులు దర్శించుకుంటారనేది ఆలయాధికారుల అంచనా. మరి ఆ లెక్కన భక్తులకు సౌకర్యాలు కల్పించారా అంటే దానికి వారి నుంచి సమాధానం ఉండదు. మరోవైపు ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆచారాలను కూడా ఇష్టమొచ్చి మార్చేయడంపై భక్తుల నుంచి విమర్శలొస్తున్నాయి. శివరాత్రి రోజున రూ.500 వందల టిక్కెటు (స్థానికులకు రూ.200) కొనుగోలు చేసిన భక్తులను గతంలో సుపథం (నాల్గవ నెంబరు గేటు) నుంచి దర్శనానికి అనుమతించేవారు. ఈ ఏడాది మాత్రం మూడో నెంబరు గేటు నుంచి అనుమతించనున్నాయి. అయితే చిక్కంతా ఇక్కడే వచ్చింది. ఈ గేటు వద్ద సుమారు రూ.6 లక్షలు వెచ్చించి కొండలా తాత్కాలిక మెట్లు ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బంది పడనున్నారు. ఎందుకంటే ఈ దర్శనానికి వచ్చేవారిలో ఎక్కువ మంది వృద్ధులు, దివ్యాంగులు ఉంటారు. ఈ కొండలాంటి మెట్లెక్కి దర్శనానికి ఎలా వెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్చకులకూ ఇబ్బందులే..: ఇక స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసేందుకు సమీపంలోని బావి నుంచి నీటిని తెచ్చి అభిషేకాలు చేస్తారు. ఇందుకోసం బిందెలతో నీటిని ఈ మెట్ల మీదుగానే అర్చకులు తీసుకెళ్లాలి. దీంతో అర్చకులూ వాపోతున్నారు.

పాలకుల సూచనలంటున్న అధికారులు: సుపథ మండపం (నాల్గవ నెంబరు గేటు) వద్ద అయితే ఎలాంటి మెట్లు ఉండవు. అంతేకాకుండా వీఐపీలు, వీవీఐపీలకు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది మాత్రం ఆ సంప్రదాయానికి మంగళం పాడారు. పాలకుల సూచనలు అంటూ కేవలం వీఐపీలు, వీవీఐపీలు మాత్రమే ఈ మార్గంలో రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టిక్కెట్లు కూడా ముద్రించి విక్రయాలు చేపట్టేశారు. అసలు సాధారణ భక్తులు ఎవ్వరూ వీఐపీలకు కనిపించకూడదనే విధంగా మూడో గేటులోకి మార్చే సంప్రదాయం మంచిది కాదని కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా చెప్పినా అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఇకనైనా గతంలోవలె సుపథ మండపం (నాల్గవ గేటు) నుంచి శివరాత్రి రోజున దర్శనానికి అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



మిద్దెల హరిని సత్కరిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

శ్రీకాళహస్తి, మార్చి 7: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి తెలిపారు. గురువారం శ్రీకాళహస్తి సంస్థ కార్యాలయంలో ప్రజారవాణాధికారి చెంగల్ రెడ్డి, శ్రీకాళహస్తి డిపో మేనేజర్ రాజ్యవర్ధన్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. చెన్నై, తలకోన, తిరుపతి, గుడిమల్లం, జీపీపురం, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, ఇతర ప్రాంతాల నుంచి శ్రీకాళహస్తికి భక్తులు భారీగా వస్తారని ఇందుకోసం ఎక్కువ బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. అలాగే ప్రజల అవసరాన్ని బట్టి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం మంచినీళ్లు, షామియానా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని.. తమ సిబ్బంది కూడా భక్తుల కోసం అందుబాటులో ఉంటారని తెలియజేశారు. శ్రీకాళహస్తిలో డ్రైవర్ల కొరత పరిష్కరించేందుకు తిరుపతిలో ఉన్న 20 మందిని ఇక్కడికి బదిలీ చేశామన్నారు.

వెండి నాగాభరణం సమర్పణ



శ్రీకాళహస్తి, మార్చి 7: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అర్ధనారీశ్వర స్వామికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వెండి నాగాభరణం సమర్పించారు. ఆలయ అధికారులకు గురువారం డిప్యూటీ సీఎం నారాయణ స్వామి చేతుల మీదుగా దీన్ని అందజేశారు. విలువ నాలుగు లక్షలుగా ఉంటుందని అధికారులు తెలిపారు. ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆసరా చెక్ పంపిణీ

ఏర్పేడు, మార్చి 7: ఏర్పేడులో డ్వాక్రా మహిళలకు రూ.13,81,00,000 చెక్‌ను గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందజేశారు. ఎంపీడీవో గిడ్డయ్య ఏపీఎం పళనీకుమార్, నాయకులు కిషోర్‌రెడ్డి, రమణయ్య యాదవ్, జనార్థన్‌యాదవ్, గాలి రవి తదితరులు పాల్గొన్నారు.


వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

తొట్టంబేడు, మార్చి 7: తొండమాన్‌పురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని గురువారం ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి దక్షిణ కైలాసం ముస్తాబు

ముక్కంటి ఆలయంలో వేకువజామున 3 గంటలకే సర్వదర్శనం

అర్ధరాత్రి 2 గంటలకు 'లింగోద్భవం'




ఆలయంలో పూల, పండ్ల అలంకరణలు

శ్రీకాళహస్తి, మార్చి 7: దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి గాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శుక్రవారం జరగనున్న మహాశివరాత్రి వేడు కలకు ముస్తాబైంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వేకువజామున రెండు గంటలకే ఆలయాన్ని తెరిచి గోపూజ, సుప్రభాత సేవలు నిర్వహిస్తారు. మూడు గంటలనుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు. లింగోద్భవ దర్శనం రాత్రి రెండు గంటల నుంచి కల్పించనున్నారు. సామాన్య భక్తుల కోసం రాజగోపురం, సమీపం నుంచి ఉచిత క్యూలైను, రూ.50 లైన్ ఏర్పాటు చేశారు. రూ.200 (స్థానికులు) రూ.500 టిక్కెట్లు కొనుగోలు చేసే భక్తుల కోసం తిరుమంజన గోపురం మూడో నెంబరు గేటు మార్గంలో క్యూలైన్ ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీలను మాత్రం దక్షిణ గాలిగోపురం మార్గంలో క్యూలైన్ కేటాయించారు. మొత్తం రెండు లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లు ఇవ్వడంతోపాటు ఆలయంలోపల ఉక్కపోతకు గురికాకుండా ఫ్యాన్లు సిద్ధం చేశారు. క్యూ లైన్లలో కాఫీ, పాలు అందుబాటులో ఉంచుతున్నారు. దర్శనానంతరం భక్తులు మహాద్వారం నుంచి వెలుపలకు రాకుండా ఈసారి అడ్డుకట్ట వేశారు. మృత్యుంజయ లింగం పక్కనుంచి ఆలయం పైకి వెళ్లి అక్కడినుంచి కన్నప్ప కొండ మెట్ల మార్గం వద్ద వెలుపలకు వచ్చేలా ప్రత్యేక క్యూలైన్ సిద్ధం చేశారు. వ్యతిరేక దారిలో భక్తులు ప్రవేశించకుండా బందోబస్తు నిర్వహించనున్నారు. అక్కడే భక్తులకు ఉచిత ప్రసాదాలందిస్తారు.

మహాలఘు దర్శనం: ఆలయంలో స్వామి అమ్మవార్ల సన్నిధిలో నాలుగు వరసల క్యూ విధానాన్ని సిద్ధం చేశారు. సామాన్య భక్తులకు రెండు, ప్రత్యేక దర్శనం టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు ఒకటి, వీఐపీలకు మరొకటి ఏర్పాటు చేశారు. ఈ క్యూలైన్‌లో ఒకదానితో ఒకటి ఎక్కడా కలిసిపోకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు.

స్వర్ణముఖిలో స్నానఘట్టాలు: శివరాత్రి సందర్భంగా భక్తుల కోసం స్వర్ణముఖి నదిలో ప్రత్యేకంగా స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. మహిళా భక్తులకు ఓవైపు, పురుషులకు మరోవైపు ఏర్పాటు చేశారు. జలవినాయకుడి సమీపంలోని ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

సర్కారు పట్టువస్త్రాల సమర్పణ: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గురువారం పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ సంప్రదాయాలతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



తేజోమయం దక్షిణ కైలాసం: దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తి తేజోమయంగా ప్రకాశిస్తోంది. ఆలయం లోపల పండ్లు, పుష్పాలతో చేసిన ముస్తాబు అబ్బురపరుస్తోంది. ఆలయ గోపురాలు, ప్రధాన కూడళ్లు, స్వర్ణముఖి నదీ ప్రాంతం కాంతివంతంగా మారింది. ఎల్‌ఈడీ లైట్లతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.



కైలాసం సెట్టింగ్: ముక్కంటి ఆలయం రెండో గేటు సమీపంలో కైలాసం సెట్టింగ్ ఏర్పాటు చేశారు. లోపల కైలాసం దృశ్యాలను తలపించేలా రంగురంగుల కాంతుల్లో మహా శివుని ప్రతిభను ఏర్పాటు చేశారు. గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పూజలు చేసి ప్రారంభించారు.



నైవేద్యం పాత్రల వితరణ: శివాలయంలో వేద పండితులుగా సేవలందిస్తున్న విశ్వనాథ శర్మ నైవేద్యం పాత్రలను వితరణ చేశారు. ఆలయ తనిఖీదారు హరి యాదవ్‌కు గురువారం అందజేశారు. వీటి విలువ రూ.55 వేలుగా అధికారులు పేర్కొన్నారు.


సంప్రదాయ దుస్తులు అందజేత: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సేవలందించే వైదిక విభాగం సిబ్బందికి సంప్రదాయ దుస్తులు అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాల పురస్కరించుకుని వేద పండితులు, అర్చకులకు ఈ వస్త్రాలను ఈవో నాగేశ్వరరావు అందజేశారు. పురపాలక సంఘం కమిషనర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



లాహిరి లాహిరిలో..: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాదీ విభిన్నమైన దృశ్యాన్ని సెట్టింగ్‌గా రూపొందిస్తుంటారు. ఈ ఏడాది రాజగోపురం ముందు ఊడల మర్రి చెట్టు నీడలో పార్వతీ పరమేశ్వరులు ఊయలలో సేదతీరుతూ ఉండే దృశ్యాన్ని రూపొందించారు. లాహిరి లాహిరిలో అంటూ భక్తులు ఈ రూపకల్పనను ఆసక్తిగా వీక్షిస్తూ సెల్ఫీలు తీసుకుంటున్నారు. దీనిని గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు.

మైమరిపించిన నాసికా వేణుగానం

తొట్టంబేడు, మార్చి 7: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నెల్లూరుకు చెందిన సాయిహేమంత్ కృష్ణ నాసికంతో వేణుగానం, భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇతను ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా నుంచి ప్రశంసలు అందుకున్నారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అయితే నాసిక బ్రహ్మ అనే బిరుదు కూడా ప్రదానం చేశారు. హైదరాబాదు అనంతలక్ష్మి భక్తి ప్రవచనాలు అలరించాయి.

చారుశ్రీవర్ధన, శంతల ఆర్ట్స్ అకాడమీ కళాకారిణుల ప్రదర్శన



సాయిహేమంత్ కృష్ణ

అలరించిన నృత్యప్రదర్శనలు: చారుశ్రీవర్ధన (గజలక్ష్మి-బాలయ్య), శంతల ఆర్ట్స్ అకాడమీ (బెంగళూరు) కళాకారిణుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను దేవస్థానం అధికారులు దుశ్శాలువా కప్పి, స్వామిఅమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

ఐదో తిరునాళ్ల, మహాశివ రాత్రి (మాఘ బహుళ త్రయోదశి)

ఉభయదారులిలా..

ఉదయం: సత్యనారాయణ అడ్వకేట్

రాత్రి: దక్షిణ భారతదేశ దేవాంగ సంఘం, వెంకటగిరి రాజా వారు

లింగోద్భవం: యద్దనవెంకట సుబ్రమహ్మణ్యశర్మ- స్వరాజ్యలక్ష్మి వారి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు, దయానంద గుప్తా బజారు వీధి, రాము గుప్తా అరుణ మెడికల్స్ శ్రీకాళహస్తి.

వాహనసేవలు

ఉదయం 10.30 గంటలకు, ఇంద్ర విమానం, చప్పర వాహనసేవ, రాత్రి 9.30 గంటలకు నంది, సింహ వాహనసేవ

నిత్య ఉత్సవాలిలా..

- ఉదయం2గంటలకు, మంగళవాయిద్యాలు
- 2.30 గంటలకు గోపూజ, సర్వదర్శనం
- 3గంటలకు సర్వదర్శనం
- 5 నుంచి 10 గంటల వరకు ఆరు కాలాల అభిషేకాలు
- 10.25 గంటలకు శ్రీస్వామిఅమ్మవార్ల పుర వీధుల ఉత్సవం:
- సాయంత్రం 4 నుంచి 6 వరకు మూడు కాలముల అభిషేకాలు
- రాత్రి 9.30 గంటలకు స్వామి, అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- రాత్రి 10 గంటలకు దర్శనం ముగింపు

ఉత్సవాల్లో భద్రతతోపాటు బాధ్యతా ముఖ్యమే..!

శ్రీకాళహస్తి, మార్చి 7: భక్తుల భద్రత కోసం మొత్తం 1,200 పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో బందోబస్తు విధుల్లో ఉన్న కొందరు అధికారుల తీరుతో విమర్శలు వెలువత్తాయి. ఎక్కడా అడ్డదారి దర్శనాలకు ప్రవేశం లేకుండా కట్టుదిట్టంగా అమలు చేస్తామని గతంలో ప్రకటించారు. కానీ భద్రతా విధుల్లో ఉన్న కొందరు అధికారులు, సిబ్బంది మహాశివరాత్రి రోజున అయినవారిని దర్శనాలకు తిప్పుకోవడానికే సరిపోవడంపై దుమారం జరిగింది. ఇక అభిషేకాలు నిర్వహించేందుకు వెళ్తున్న ఆలయ అభిషేక గురుకులను, ఉత్సవాల ప్రత్యేక అధికారిని ఆంక్షల పేరుతో భద్రతాధికారులు అడ్డుకోవడం కూడా అప్పట్లో విమర్శలకు దారి తీసింది. అదే రోజు ఆలయ పీఆర్వోని సైతం పక్కకు నిర్దాక్షిణ్యంగా తోసివేయడంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇలాంటివి పునరావృతం కాకుండా ఈసారి ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉంది.

భక్తుల నిలువు దోపిడీ

శ్రీకాళహస్తి, మార్చి 7: మహాశివరాత్రి డిమాండ్‌ను చూపిస్తూ లాడ్జిల నిర్వాహకులు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా అధిక ధరలు వసూలు చేయకూడదంటూ అధికారులు ఆదేశాలు జారీ చేస్తుంటారు. ఈసారి మాత్రం లాడ్జిల నిర్వాహకులతో సమావేశం నిర్వహించక పోవడంతో అధికారుల తీరుపై విమర్శలొస్తున్నాయి. సాధారణంగా రూ.500 ఉండే ఒక గదిని గురువారం నుంచి అమాంతంగా రూ.3000కి పెంచేశారు. నిర్వాహకులంతా సిండికేట్‌గా మారి పట్టణమంతా బహిరంగ దందాకు తెరతీశారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారీ పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు భక్తులైతే ఇదేం అన్యాయమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ల తీరూ అంతే..

బ్రహ్మోత్సవాలను ఆటోడ్రైవర్లు కూడా ధనార్జనే ధ్యేయంగా వాడుకుంటున్నారు. శివారు ప్రాంతాల్లో దిగే భక్తులను లాడ్జిలో గది తీసుకుంటారా లేదా అని ప్రశ్నిస్తున్నారు. గది కావాలి అని అంగీకరించిన వారిని మాత్రమే ఆటోలో ఎక్కించుకుంటున్నారు. ఎందుకంటే ముందుగానే లాడ్జీల నిర్వాహకులతో కమీషన్ల బేరం కుదుర్చుకోవడమే దీనికి కారణం.

బిస్కెట్ల వితరణ



శ్రీకాళహస్తి, మార్చి 7: మహాశివరాత్రి రోజున క్యూ లైన్‌లో భక్తులకు పంపిణీ చేసేందుకు బిస్కెట్లను పట్టణానికి చెందిన అరుణ మెడికల్స్ నిర్వాహకులు రాముగుప్త వితరణ చేశారు. గురువారం వీటిని ముక్కంటి ఆలయ అధికారులకు అందజేశారు. ఈవో నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




గురువారం ఉదయం హంస, చిలుక వాహనాలపై స్వామి అమ్మవార్లు - కళాకారుల కోలాటం

చేతిమగ్గంతో నేసిన వస్త్రాలను విక్రయించండి



లేపాక్షిలో విజయలక్ష్మి

తిరుమల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : చేతి మగ్గం ద్వారా నేసిన వస్త్రాలను అధికంగా విక్రయించాలని తిరుమల లేపాక్షి సిబ్బందికి ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి సూచించారు. గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె తిరుమలలోని లేపాక్షిని సందర్శించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తిచేయాలన్నారు. చేతివృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేసి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. చేతిమగ్గాల ద్వారా తయారు చేసిన చీరలు, వస్త్రాలను మాత్రమే అన్ని లేపాక్షి ఎంపోరియంలలో విక్రయించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, తిరుమల లేపాక్షి మేనేజర్ వేంకటేశం, జమ్మలమడుగు మున్సిపల్ చైర్‌పర్సన్ శివమ్మ పాల్గొన్నారు.

భూలక్ష్మి సంస్థ సభ్యులకు బ్రష్‌కట్టర్స్ పంపిణీ



తిరుపతి రూరల్, మార్చి 7: కెనడినగర్‌లోని తిరుపతి భూలక్ష్మి నాచురల్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ సభ్యులకు ఐఐటీ ఆధ్వర్యంలో గురువారం బ్రష్ కట్టర్స్ పంపిణీ చేశారు. గ్రీన్‌ప్యానల్ ఇండస్ట్రీస్ సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్ట్ సహకారంతో ఏడుగురు సభ్యులకు అందించినట్లు సీఈవో డాక్టర్ కె.గంగాధరం పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు యాంత్రీకరణను వినియోగించుకోవాలని ఉద్దేశంతో వాటిని అందించామని తెలిపారు. ప్రిసెషన్ ఫార్మింగ్, ఫుడ్ టెక్నాలజీ అవశ్యకతను రైతులు అందిపుచ్చుకోవాలని వివరించారు. ఐఐటీలో ఇంక్యుబేషన్ యూనిట్ ప్రారంభిస్తున్నామని తెలిపారు.

రైతులకు వృత్తి నైపుణ్య సేవలు అందించాలి



భాస్కరయ్య

తిరుపతి(రూరల్), మార్చి7: రైతులకు వృత్తి నైపుణ్యంతో సేవలను అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి వ్యవసాయాధికారులకు డిజిటల్ యాప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగులో రైతులకు డిజిటల్ సేవలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది వృత్తి నైపుణ్యాలను పెంచుకుని క్షేత్రస్థాయిలో రైతులకు అందించాలని తెలిపారు. సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ సంస్థ దక్షిణాసియా కోఆర్డినేటర్ మధుమంజిరి మాట్లాడుతూ తమసంస్థ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత ఆన్‌లైన్ కోర్సులు, డిజిటల్ యాప్స్‌ని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య, డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, భూసార పరీక్షా కేంద్రం అధికారులు పాల్గొన్నారు.

పీసీ రాయల్‌కు అవార్డు ప్రదానం



తిరుపతి అర్బన్, మార్చి 7: కస్తూర్బాగాంధీ కేంద్ర ట్రస్టు చైర్మన్ డాక్టర్ పీసీ రాయల్‌కు హైదరాబాదు టర్కీ కాన్సులేట్ జనరల్ సహకారంతో ఐక్యరాజ్యసమితి గ్లోబల్ పీస్ కౌన్సిల్ యునైటెడ్ నేషన్స్ ఎక్సలెన్స్ అవార్డు దక్కింది. యూఎస్ఏ, టర్కీ, యూకే, యూఏఈ, ఆఫ్గనిస్తాన్, ఇరాన్ దేశాల దౌత్యవేత్తల సమక్షంలో ఆయన ఈ అవార్డును బుధవారం రాత్రి అందుకున్నారు. వీసీఆర్ గ్రూప్ సలహాదారు ఏఎల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉప్పరపాళెంలో తాగునీటి కొరత



స్టార్టర్, బోరు మోటార్ భూమి లోపలకు వెళ్లిపోవడంతో గుంతతవ్విన దృశ్యం

తిరుపతి అర్బన్, మార్చి 7 : శెట్టిపల్లె పంచాయతీ పరిధిలోని ఉప్పరపాళెం (నారాయణాద్రి ఆస్పత్రికి ఉత్తరంగా)గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గ్రామస్తులు చందాలు వేసుకుని ట్యాంకర్‌తో నీరు తెప్పించుకుంటున్నారు. గ్రామానికి నీరందించే బోరు మోటారు వారం క్రితం మరమ్మతులకు గురైంది. మోటారు మట్టిలో కూరుకుపోవడంతో పైకి తీయడానికి వీల్లేకుండా పోయింది. గుంత తవ్వినా ఫలితం లేకపోయింది. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గ్రామం నగరపాలక సంస్థలో విలీనమైంది కాబట్టి అక్కడ ఫిర్యాదు చేయాలని ఉచిత సలహాలు ఇస్తున్నారు. నగరపాలక సంస్థలోని సంబంధిత విభాగానికి సమాచారం అందించినా తమ పరిధిలోకి రాదని వారు సమాధానం ఇస్తున్నారు. ఇలా కాలయాపన జరుగుతుండడంతో గ్రామస్తులు నీటికోసం తిప్పలు పడుతున్నారు. పాలకులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు 798మంది గైర్హాజరు



ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షలను పర్యవేక్షిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), మార్చి7: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షలకు గురువారం జిల్లాలో 798 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో జీవీ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 28,915 మందికిగాను 28,117 మంది పరీక్ష రాశారని వివరించారు. జనరల్‌లో 27,771మందికి 27,053 మంది హాజరవ్వగా..718మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,144మందికి 1,064మంది హాజరవ్వగా 80మంది హాజరుకాలేదని తెలిపారు. ఆర్ఐవో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఇంటర్‌బోర్డు శ్వాస తీసుకోండి..ఒత్తిడి కాదు అన్న పోస్టర్లను తెలుగు, ఆంగ్లమాధ్యమంలో రూపొందించిందని, వీటిని జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆర్ఐవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షలు జరుగుతున్న విధానాన్ని అధికారులు పర్యవేక్షించారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో మహిళా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్స్

తిరుపతి (విద్య), మార్చి7 : కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక, సేవా రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో మహిళలకు చదువు, ఉద్యోగం అవశ్యకతపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రతిభచాటిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎలక్ట్రానిక్స్ విభాగ అధ్యాపకురాలు పి.లక్ష్మీశిల్ప, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, అధ్యాపకులు డాక్టర్ అపర్ణ, యశోద, సూపరింటెండెంట్ బబితారాణి, బయో మెడికల్ ఇంజినీరింగ్ హెడ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కల్పవృక్ష, అశ్వ వాహనాలపై కపిలేశ్వరుడు



అశ్వ, కల్పవృక్ష వాహనాలపై కపిలేశ్వరస్వామి

తిరుపతి (కల్చరల్), మార్చి 7: కపిలేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం కామాక్షి సమేత సోమస్కంద మూర్తి కల్పవృక్ష వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ కపిల తీర్థంనుంచి అన్నారావుకూడలి,వినాయక నగర్ క్వార్టర్స్, ఎన్‌జీవోకాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా ఊరేగింపు సాగింది. దారిపొడవునా భక్తులు స్వామి వారికి కర్పూర నీరాజనాలు పట్టారు. అనంతరం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం అభిషేక సేవ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి విశేష దీపారాధన నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లను అశ్వ వాహనంపై పురవీధులలో ఊరేగించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం రథోత్సవం ఉంటుంది. రాత్రి నంది వాహన(గ్రామోత్సవం) సేవ నిర్వహిస్తారు. సుబ్బరాజు నాట్యకళా పరిషత్ తిరుపతి వారి ఆధ్వర్యంలో పార్వతీకల్యాణం నాటక ప్రదర్శన ఉంటుంది.

మహాశివరాత్రికి దక్షిణ కైలాసం ముస్తాబు

ముక్కంటి ఆలయంలో వేకువజామున 3 గంటలకే సర్వదర్శనం ● అర్ధరాత్రి 2 గంటలకు 'లింగోద్భవం'

శ్రీకాళహస్తి, మార్చి 7: దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి గాంచిన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి వేడు కలకు ముస్తాబైంది. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం వేకువజామున రెండు గంటలకే ఆలయాన్ని తెరిచి గోపూజ, సుప్రభాత సేవలు నిర్వహిస్తారు. మూడు గంటలనుంచి సర్వదర్శనానికి అనుమతిస్తారు. లింగోద్భవ దర్శనం రాత్రి రెండు గంటల నుంచి కల్పించనున్నారు. సామాన్య భక్తుల కోసం రాజగోపురం, సమీపం నుంచి ఉచిత క్యూలైను, రూ.50 లైన్ ఏర్పాటు చేశారు. రూ.200 (స్థానికులు) రూ.500 టిక్కెట్లు కొనుగోలు చేసే భక్తుల కోసం తిరుమంజన గోపురం మూడో నెంబరు గేటు మార్గంలో క్యూలైన్ ఏర్పాటు చేశారు. వీవీఐపీ, వీఐపీలను మాత్రం దక్షిణ గాలిగోపురం మార్గంలో క్యూలైన్ కేటాయించారు. మొత్తం రెండు లక్షల మంది వస్తారని అధికారులు అంచనా వేసి ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లు ఇవ్వడంతోపాటు ఆలయంలోపల ఉక్కపోతకు గురికాకుండా ఫ్యాన్లు సిద్ధం చేశారు. క్యూ లైన్లలో కాఫీ, పాలు అందుబాటులో ఉంచుతున్నారు. దర్శనానంతరం భక్తులు మహాద్వారం నుంచి వెలుపలకు రాకుండా ఈసారి అడ్డుకట్ట వేశారు. మృత్యుంజయ లింగం పక్కనుంచి ఆలయం పైకి వెళ్లి అక్కడినుంచి కన్నప్ప కొండ మెట్ల మార్గం వద్ద వెలుపలకు వచ్చేలా ప్రత్యేక క్యూలైన్ సిద్ధం చేశారు. వ్యతిరేక దారిలో భక్తులు ప్రవేశించకుండా బందోబస్తు నిర్వహించనున్నారు. అక్కడే భక్తులకు ఉచిత ప్రసాదాలందిస్తారు.

మహాలఘు దర్శనం : ఆలయంలో స్వామి అమ్మవార్ల సన్నిధిలో నాలుగు వరసల క్యూ విధానాన్ని సిద్ధం చేశారు. సామాన్య భక్తులకు రెండు, ప్రత్యేక దర్శనం టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు ఒకటి, వీఐపీలకు మరొకటి ఏర్పాటు చేశారు. ఈ క్యూలైన్‌లో ఒకదానితో ఒకటి ఎక్కడా కలిసిపోకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు.

స్వర్ణముఖిలో స్నానఘట్టాలు

శివరాత్రి సందర్భంగా భక్తుల కోసం స్వర్ణముఖి నదిలో ప్రత్యేకంగా స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. మహిళా భక్తులకు ఓవైపు, పురుషులకు మరోవైపు ఏర్పాటు చేశారు. జలవినాయకుడి సమీపంలోని ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

సర్కారుపట్టువస్త్రాల సమర్పణ : శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆది దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గురువారం పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ సంప్రదాయాలతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఈవో నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.



చీర్ల కిరణ్‌కు పలువురి శుభాకాంక్షలు



కిరణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న పోటు కార్మికులు

తిరుపతి అర్బన్, మార్చి 7 : టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు, వెల్ఫేర్ అసోసియేషన్, రాష్ట్ర సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చాంబర్‌లో వేదపండితులు ఆశీర్వచనం పలికి, శ్రీవారి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. ప్రభుత్వ, టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు, పార్టీల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు సత్కరించారు. మధ్యాహ్నం రాజన్న పార్కు వద్ద అనాథ పిల్లలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు చిన్నంగారి సూరి, వంకీపురం పవన్, మణికంఠ, గంట భరత్, ధరణికుమార్, యుగంధర్‌రెడ్డి, నాగరాజు, గోపీకుమార్‌రెడ్డి, ఈశ్వర్, హేమలత, రేఖ, వంశీ, తులసి, అనురాధ, కొప్పర్తి శివ, చిన్ని పెరుమాళ్, టీటీడీ అర్చకులు, శ్రీవారి పోటు ఉద్యోగులు పాల్గొన్నారు.

600 బస్సులు 'సిద్ధం' చేయండి

రవాణా శాఖ అధికారులకు అధికార పార్టీ టార్గెట్

ప్రైవేటు పాఠశాలలు, ట్రావెల్స్ యాజమాన్యాలపై ఒత్తిడి

తిరుపతి (రవాణా), మార్చి 7: ఒంగోలులో ఈనెల 10వ తేదీన వైసీపీ నిర్వహించనున్న సిద్ధం సభకు తిరుపతి జిల్లా నుంచి 600 బస్సులు సిద్ధం చేయాలని జిల్లా రవాణా శాఖ అధికారులకు ఆ పార్టీ నాయకులు టార్గెట్ పెట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారులు అన్ని బస్సులు ఎలా సేకరించాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. పైగా శనివారం సాయంత్రం కల్లా బస్సులను వైసీపీ నాయకులకు అప్పగించాలని షరతు పెట్టడంతో తలలు పట్టుకుంటున్నారు. తిరుపతి జిల్లాలో ఎక్కువ సంఖ్యలో విద్యాసంస్థలు ఉండటంతో ఒత్తిడి ఎక్కువైంది. తిరుపతిలో 60కిపైగా విద్యాసంస్థలు, పాఠశాలలు ఉన్నాయి. ప్రతి పాఠశాల, ప్రైవేటు ట్రావెల్స్ నుంచి కచ్చితంగా బస్సులు పంపేలా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేట, పుత్తూరుకు 400కుపైగానే టార్గెట్ ఇచ్చినట్లు సమాచారం. పిల్లలకు ఇబ్బంది అవుతుందని విద్యా సంస్థల యాజమాన్యాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన సిద్ధం సభలకు బస్సులను పంపి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద చీవాట్లు తిన్నామని, మళ్లీ అంటే ఎలా అని అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం.

వినాయకసాగర్‌లో వ్యర్థాలను తొలగించండి

తిరుపతి (రవాణా), మార్చి 7: నగర పరిధిలోని వినాయకసాగర్‌లో వ్యర్థాలను తొలగించాలని సీపీఎం నేత కందారపు మురళి కోరారు. సాగర్‌కు సందర్శకులు, వాకర్స్ పెద్దసంఖ్యలో వస్తున్నారని, ఈ ప్రాంతం దుర్గంధం, వ్యర్థాలతో నిండిపోవడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వినాయకుడి విగ్రహాలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని, వాటిని ఇప్పటివరకు తొలగించలేదని అన్నారు. కొలను గుర్రపు డెక్క, మొక్కలతో నిండిపోయిందని తెలిపారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి, వ్యర్థాలను తొలగించి, నీటిని శుద్ధి చేసే విధానాన్ని అమలుపరచాలని కోరారు.

మైమరిపించిన నాసికా వేణుగానం



సాయిహేమంత్ కృష్ణ

తొట్టంబేడు, మార్చి 7: శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నెల్లూరుకు చెందిన సాయిహేమంత్ కృష్ణ నాసికంతో వేణుగానం, భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇతను ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా నుంచి ప్రశంసలు అందుకున్నారు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అయితే నాసిక బ్రహ్మ అనే బిరుదు కూడా ప్రదానం చేశారు.

రైళ్లలో చోరీలు చేసే వ్యక్తి అరెస్ట్

30గ్రాముల బంగారు, రెండు ఐ ఫోన్ల స్వాధీనం



నిందితుడితోపాటు స్వాధీనం చేసుకున్న సొత్తును చూపుతున్న పోలీసులు

తిరుపతి(ఆటోనగర్) మార్చి7 : రైళ్లలో ఏసీ కోచ్‌లలో ప్రయాణించే వారే లక్ష్యంగా చోరీలు చేసే వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 30 గ్రాముల బంగారు నగలు, రెండు ఐ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్‌పీ సీఐ హేమసుందర్‌రావు, రైల్వే భద్రతా దళాల ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. రైల్వే స్టేషన్‌లోని జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో గురువారం ఆ వివరాలను మీడియాకు వివరించారు. గత నెల కేరళ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తున్న వారి నుంచి రూ.1.60 లక్షల విలువైన రెండు ఐ ఫోన్లు, సెవన్ హిల్స్ ఎక్స్‌ప్రెస్‌లో రూ1.70 లక్షల విలువైన 30 గ్రాముల బంగారు మంగళసూత్రం చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, అనుమానాస్పదంగా కనిపించిన రాజస్థాన్‌కు చెందిన కాలురామును పట్టుకుని విచారించగా చోరీలకు పాల్పడింది తనేనని అంగీకరించాడని తెలిపారు. అతని నుంచి నగలు, ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ చేయూత నిధుల జమ

● మహిళల ఖాతాల్లోకి రూ.210.82కోట్లు



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7: రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనారిటీ వర్గాల మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద గురువారం నాలుగో విడత నిధులు జమ చేసింది. అనకాపల్లి జిల్లా నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి నిధులను జమ చేయగా కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్, లబ్ధిదారులు హాజరయ్యారు. జిల్లాలో 1,12,436మంది లబ్ధిదారులకు రూ.210.82కోట్లు జమ చేసినట్లు జేసీ తెలిపారు. ఈ మేరకు లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి పాల్గొన్నారు.

శివరాత్రి నాడు ఇదేం కష్టం ముక్కంటీశా!

కొండలా ఏర్పాటు చేసిన మెట్లెలా ఎక్కాలి? ● సామాన్య భక్తుల ఆవేదన



మూడో నెంబరు వద్ద ఏర్పాటు చేసిన మెట్లు - స్థానికులకు ఇచ్చిన ప్రత్యేక దర్శనం టిక్కెట్లు

శ్రీకాళహస్తి, మార్చి 3: శ్రీకాళహస్తీశ్వరాలయానికి మహాశివరాత్రి పర్వదినాన లక్షన్నర మందికిపైగా భక్తులు దర్శించుకుంటారనేది ఆలయాధికారుల అంచనా. మరి ఆ లెక్కన భక్తులకు సౌకర్యాలు కల్పించారా అంటే దానికి వారి నుంచి సమాధానం ఉండదు. మరోవైపు ఎన్నో ఏళ్లుగా ఉన్న ఆచారాలను కూడా ఇష్టమొచ్చి మార్చేయడంపై భక్తుల నుంచి విమర్శలొస్తున్నాయి. శివరాత్రి రోజున రూ.500 వందల టిక్కెటు (స్థానికులకు రూ.200) కొనుగోలు చేసిన భక్తులను గతంలో సుపథం (నాల్గవ నెంబరు గేటు) నుంచి దర్శనానికి అనుమతించేవారు. ఈ ఏడాది మాత్రం మూడో నెంబరు గేటు నుంచి అనుమతించనున్నారు. అయితే చిక్కంతా ఇక్కడే వచ్చింది. ఈ గేటు వద్ద సుమారు రూ.6 లక్షలు వెచ్చించి కొండలా తాత్కాలిక మెట్లు ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బంది పడనున్నారు. ఎందుకంటే ఈ దర్శనానికి వచ్చేవారిలో ఎక్కువ మంది వృద్ధులు, దివ్యాంగులు ఉంటారు. ఈ కొండలాంటి మెట్లెక్కి దర్శనానికి ఎలా వెళ్లాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్చకులకూ ఇబ్బందులే.. : ఇక స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసేందుకు సమీపంలోని బావి నుంచి నీటిని తెచ్చి అభిషేకాలు చేస్తారు. ఇందుకోసం బిందెలతో నీటిని ఈ మెట్ల మీదుగానే అర్చకులు తీసుకెళ్లాలి. దీంతో అర్చకులూ వాపోతున్నారు.

పాలకుల సూచనలంటున్న అధికారులు

సుపథ మండపం (నాల్గవ నెంబరు గేటు) వద్ద అయితే ఎలాంటి మెట్లు ఉండవు. అంతేకాకుండా వీఐపీలు, వీవీఐపీలకు కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారు. ఈ ఏడాది మాత్రం ఆ సంప్రదాయానికి మంగళం పాడారు. పాలకుల సూచనలు అంటూ కేవలం వీఐపీలు, వీవీఐపీలు మాత్రమే ఈ మార్గంలో రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టిక్కెట్లు కూడా ముద్రించి విక్రయాలు చేపట్టేశారు. అసలు సాధారణ భక్తులు ఎవ్వరూ వీఐపీలకు కనిపించకూడదనే విధంగా మూడో గేటులోకి మార్చే సంప్రదాయం మంచిది కాదని కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా చెప్పినా అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఇకనైనా గతంలోవలె సుపథ మండపం (నాల్గవ గేటు) నుంచి శివరాత్రి రోజున దర్శనానికి అనుమతించాలని భక్తులు కోరుతున్నారు.

సమాజాభివృద్ధిలో మహిళా సాధికారత కీలకం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7: సమాజ అభివృద్ధిలో మహిళా సాధికారత కీలకమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో స్త్రీసమానత్వమే ప్రగతికి మూలమన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలిగిన రోజు దేశం అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యాపారం, రాజకీయం, క్రీడలు వంటి రంగాల్లో మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళా అధికారులను కలెక్టర్ సన్మానించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న రమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7: పద్మావతి మహిళా యూనివర్సిటీ హోంసైన్స్ పరిశోధకురాలు వి.రమ డాక్టరేట్ పొందారు. ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ న్యూట్రిషనల్ సప్లిమెంటేషన్ ఆన్ థైరాయిడ్ ఫంక్షన్ అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ జ్యోతి పర్యవేక్షణలో సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. పద్మావతి వర్సిటీలో గురువారం నిర్వహించిన 21వ స్నాతకోత్సవంలో వీసీ భారతి చేతుల మీదుగా రమ డాక్టరేట్ అందుకున్నారు. సికింద్రాబాదులోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో లెక్చరర్‌గా రమ ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఆమె రాసిన రెండు పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 4 జాతీయ, 2 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. వివిధ వర్క్‌షాపులకు హాజరయ్యారు. పలువురు ఆమెను అభినందించారు.

ఆర్టీఐ ప్రజల చేతిలో ఆయుధం

ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న హరిప్రసాదరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7: సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధమని ఆర్టీఐ రాష్ట్ర కమిషనర్ హరిప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఎస్వీ యూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఆర్టీఐ అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాధితుల చేతిలో ఆయుధంగా ఆర్టీఐ నిలుస్తుందన్నారు. ఈ చట్టం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాలన్నారు. విద్యావంతులు సమాజంలో మార్పు తేవాలని సూచించారు. ఫోరం ఫర్ ఆర్టీఐ ప్రతినిధులు చంద్రకళారెడ్డి, చంద్రమోహన్, మాట్లాడుతూ ఏ సమాచారాన్ని అయినా తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని, దీనికి సమాచార హక్కు చట్టం అండగా నిలుస్తుందని అన్నారు.

సారంగపాణి ప్రాజెక్టు ప్రారంభం



సారంగపాణి కీర్తనల సీడీ ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి (కల్చరల్), మార్చి 7: రసవత్తరమైన సారంగపాణి కీర్తనలను జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లడానికి టీటీడీ చేస్తున్న ప్రయత్నం సంతోషదాయకమని ప్రముఖ సినీ నేపథ్య గాయని, పద్మభూషణ్ పి.సుశీల అన్నారు. శుక్రవారం సాయంత్రం శ్వేత భవనంలో టీటీడీ ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు సారంగపాణి ప్రాజెక్టును ఆమె జ్యోతి వెలిగించి, లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అమోఘమైన ఈ కీర్తనలలో వేణుగోపాలుని దివ్యత్వం నిండి ఉందన్నారు. కార్వేటినగరంలోని వేణుగోపాల స్వామిని కీర్తిస్తూ 17వ శతాబ్దంలో ఆలపించిన కీర్తనలు శృంగార, భక్తి రసప్రధానంగా ఉంటాయని తెలిపారు. అనంతరం ఎస్వీబీసీ అధ్యక్షుడు డాక్టర్ సాయికృష్ణయాచేంద్ర స్వరపరచిన సారంగపాణి కీర్తనల సీడీని సుశీల ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, శ్వేత సంచాలకులు భూమన్, విభీషణ శర్మ, పలువురు సాహితీప్రియులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం




తిరుపతి (కల్చరల్), మార్చి 7: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నూతన పాలకమండలి గురువారం ఉదయం ఆలయంలో ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షుడిగా కట్టా గోపి యాదవ్, సభ్యులుగా టి.వెంకటేశ్వరరావు, ఎం.హరినాథ్‌రెడ్డి, టి.రమణమ్మ, పి.ధనశేఖర్, వి.గీత, ఎస్.భారతి, సీహెచ్ సుజాత, వి.కృష్ణమ్మ ప్రమాణం చేశారు. గత పాలకమండలి అలాగే కొనసాగడం గమనార్హం. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఈవో కె.మమత పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మీడియా పాత్ర కీలకం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీడియా పాత్ర చాలా కీలకమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడంలో మీడియా ప్రధానంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, అధికారులు బాలకొండయ్య పాల్గొన్నారు.

శేష వాహనంపై శివయ్య చిద్విలాసం



శేష, యాళి వాహనాలపై ఆదిదంపతులు

శ్రీకాళహస్తి, మార్చి 7: నాగ భూషణుడైన శివయ్య ఆదిశేషుని పడగ నీడలో గురువారం రాత్రి భక్తులకు శోభాయమానంగా దర్శనమిచ్చారు. ఆయన దేవేరి జ్ఞానాంబిక అమ్మవారు యాళి వాహనంపై కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజును నాగరాత్రిగా ఆరాధించారు. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామి, చిలుక వాహనంపై అమ్మవారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి శేష వాహనంపై పరమశివుడు, యాళి వాహనంపై పార్వతీదేవి, ముందుగా మూషిక వాహనంపై వినాయక స్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారంగా సాగింది. కళాకారుల కోలాటాల నడుమ శివనామస్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7: క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గురువారం తిరుపతి అర్బన్ శెట్టిపల్లిలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రహిత రాష్ట్రం కోసం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్యశాఖ, స్విమ్స్ ఆస్పత్రి సహకారంతో చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి పాల్గొన్నారు.

టెండర్ల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 7 : ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో అవసరమయ్యే కంప్యూటర్లు, ప్రింటర్లు, స్టేషనరీ వంటి ఎన్నికల సామాగ్రి సరఫరా కోసం ఆసక్తి గల వారి నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. 11వ తేదీలోపు టెండర్లు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు తిరుపతి కలెక్టరేట్, 6281157783నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం: డీజీపీ

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం పోలీసు శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ బాస్ మాట్లాడుతూ మహిళలపై వేధింపుల నుంచి రక్షణ కోసం దిశ యాప్.. ఫిర్యాదులకు దిశ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళలపై నేరాలకు పాల్పడిన వారికి త్వరగా శిక్ష పడేలా జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో దర్యాప్తు చేయించి బాధ్యులను జైలుకు పంపుతున్నట్లు వివరించారు. డీఆర్‌డీవో, ఇస్రో, చంద్రయాన్ తదితర దేశం గర్వించే పనుల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఎన్నో కేసులను చేధించడంలో ప్రతిభ చూపిన ఫోరెన్సిక్, సైబర్ విభాగాల మహిళా ఉద్యోగులకు ఈ సందర్భంగా డీజీపీ బహుమతులు అందజేశారు. ఆరుసార్లు హిమాలయాల్ని అధిరోహించిన డీజీపీ కార్యాలయ జేఏవో పద్మావతిని ప్రత్యేకంగా అభినందించారు.

జగన్ దళిత వ్యతిరేకి : వర్ల

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'జగన్ దళిత వ్యతిరేకి. ఆయన పక్కన దళితులు కూర్చుంటే ఆయనకు గిట్టదు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా వెలిగొండ సభలో వైసీపీ ఇన్‌చార్జ్ తాడిపత్రి చంద్రశేఖర్, మంత్రి ఆదిమూలం సురేశ్‌ను వేదిక నుంచి కిందికి దింపి జగన్ నేరం చేశారన్నారు. ఆ స్థానాల్లో తన వర్గీయులైన వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను కూర్చోబెట్టారన్నారు. జగన్ పక్కన దళితులు కూర్చోవడం ఇష్టం లేకనే లేపి కిందికి పంపారన్నారు.

చేయూత కాదు.. చేతివాటం: పంచుమర్తి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మాటల్లో అక్క చెల్లెమ్మలంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్ మహిళలను నట్టేట ముంచుతున్నారని ఒక ప్రకటనలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ఆరోపించారు. అనకాపల్లి చేయూత సభలో జగన్ మహిళలను ఉద్ధరించినట్లు పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. జగన్ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరని, రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని మహిళలే గద్దె దించుతారన్నారు.

మహిళల్లో ఆత్మగౌరవం నింపుతాం: చంద్రబాబు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మహిళలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహిళలంటే సమాజంలో సగం జనాభా మాత్రమే కాదు, సమాజ శక్తిలో సగం అని పేర్కొన్నారు. అందుకే మహిళలను తోబుట్టువుల్లా చూసిన ఏకైక పార్టీ తెలుగుదేశం అని గుర్తు చేశారు. మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టి వారిలో ఆత్మ విశ్వాసం నింపి, ఆర్థిక స్వావలంబనకు నిరంతరం పని చేసింది టీడీపీనేనన్నారు. మీ అందరి మద్దతుతో త్వరలో ఏర్పడే టీడీపీ-జనసేన ప్రభుత్వంలో మీకు అభివృద్ధి, భద్రత కల్పిస్తామని చంద్రబాబు అన్నారు.

పెదకూరపాడులో లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలి

- ఈసీకి ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ లేఖలు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని సున్నితమైన పోలింగ్‌బూత్‌ల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటుచేసి లైవ్ వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని ఎన్నికల ప్రధానాధికారికి మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ లేఖలు రాశారు. నియోజకవర్గంలోని శాంతిభద్రత సమస్యలు తలెత్తే 25 ప్రాంతాల్లో భారీ బందోబస్తు పెట్టి నిరంతరం వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని కోరారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహణకు పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఎన్నికల అధికారి తగు ఆదేశాలివ్వాలంటూ శాంతిభద్రతల సమస్యల జాబితాను జత చేసి అందించారు.

ఆరు వారాల్లో జగన్ సర్కారు కూలడం ఖాయం

- రఘురామరాజు

న్యూఢిల్లీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): 'మరో ఆరు వారాల్లో ప్రజా వ్యతిరేక జగన్ సర్కార్ కూలిపోవడం ఖాయం. తనను వ్యతిరేకించే వారిపై దౌర్జన్యాలకు పాల్పడుతూ, వారిని నీచమైన భాషలో దూషిస్తూ, తల్లిని, చెల్లిని తిట్టించే దుష్ట సంస్కృతికి చరమగీతం పాడడం ఎంతో దూరంలో లేదు. అటువంటి వారికి సమాధి కట్టడానికి ఎన్నికలే పునాది అవుతాయి' అని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాటాడారు. 'రాష్ట్రంలో రెండేసి ఓట్లు ఉన్న వారి ఓట్లను తొలగించాలని, ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రపతికి ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేసిన వ్యక్తి ఇంట్లోకి ఒక రౌడీ ముఠా చొరబడి దౌర్జన్యం చేసింది. ఐపీ అడ్రస్ ఆధారంగా సజ్జల గ్యాంగ్ అతని ఇంటి మీదికి వెళ్లి, చంపేస్తామని బెదిరించడం వారి దౌర్జన్యాలకు పరాకాష్ఠ. ఎంతమందిని బెదిరించగలరు? ఎంతమందిని చంపగలరు?' అని ఎంపీ అన్నారు.

మా డిమాండ్లను మేనిఫెస్టోల్లో పెట్టాలి

- రాజకీయ పార్టీలకు పరిశ్రమల సమాఖ్య విజ్ఞప్తి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలకు పెండింగ్ ప్రోత్సాహకాలు, రీయింబర్స్‌మెంట్ అంశాలతోసహా ప్రధానమైన డిమాండ్లను రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు (వైసీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ) ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సమాఖ్య విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థల సమగ్ర అభివృద్ధికి మెరుగైన పారిశ్రామిక విధానాలతోపాటు ప్రత్యేక బడ్జెట్ ఉండాలంటూ కొన్ని సూచనలు చేసింది. ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు సరసమైన ధరలకు భూములు కేటాయించాలని, పరిశ్రమల విద్యుత్ రేట్లను పొరుగు రాష్ట్రాల స్థాయికి తగ్గించాలని, పొరుగు రాష్ట్రాలతో పోటీ పడేందుకు ఇంధన చార్జీలూ తగ్గించాలని కోరింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అన్ని కేటగిరీల లైసెన్సులకు కనీసం ఐదేళ్లపాటు ఎన్‌వోసీ జారీ చేయాలని, బ్యూరోక్రటిక్ వేధింపులను తగ్గించి.. జిల్లా పరిశ్రమల కేంద్రాలు ప్రభావవంతంగా పనిచేసేలా పునర్నిర్మించాలని డిమాండ్ చేసింది. అన్ని జిల్లాల్లో మహిళా పారిశ్రామికవేత్తల పార్కులను అభివృద్ధి చేయాలని కోరింది.

13న వివిధ లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఔట్ రీచ్ ప్రోగ్రాంలో భాగంగా వివిధ జాతీయ పథకాల లబ్ధిదారులతో ఈనెల 13న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా మాట్లాడతారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి సీఎస్, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్డీసీ, ఎన్ఎస్కేఎఫ్‌డీసీ, ఎన్సీసీఏఫ్టీసీ, నమస్తే పథకాల కింద నూతన రుణ గ్రహీతలతో ప్రధాన మంత్రి మాట్లాడతారని చెప్పారు. కాగా 20240-25 ఆర్మీ రిక్రూట్‌మెంట్‌పై సీఎస్ సమీక్ష నిర్వహించారు. వచ్చే నవంబరులో గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలోని 13 జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

భారతీయుల మూలాలెక్కడివి?

- 50వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి వచ్చినవారితో పాటు మూడు సమూహాల్లో మన మూలాలు
- ఎయిమ్స్ సహా పలు ప్రముఖ వర్సిటీలకు చెందిన పరిశోధకుల బృందం చేసిన రిసెర్చ్‌లో వెలుగులోకి

న్యూఢిల్లీ, మార్చి 7: భారతీయులు ఎక్కడి నుంచి వచ్చారు? మన పూర్వీకుల మూలాలు ఎక్కడివి? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుక్కోవడానికి గతంలో చాలా పరిశోధనలే జరిగాయి. తాజాగా.. పాపులేషన్ జెనెటిసిస్ట్ ప్రియా మూర్జానీ నేతృత్వంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మిషిగన్ వర్సిటీ, పెరెల్‌మ్యాన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ క్యాలిఫోర్నియా అండ్ యూసీ బర్కిలీ పరిశోధకులు చేసిన పరిశోధనల్లో మన మూలాలకు సంబంధించి పలు సంచలన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ బృందం మనదేశంలోని అన్ని ప్రాంతా లు, భాషలు, తెగలకు చెందిన 2762 మంది జన్యునమూనాలు సేకరించి, పరిశీలించి, భారతీయుల్లో అత్యధికుల మూలాలు.. 50 వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి వచ్చినవారితోపాటు, ఇరాన్‌కు చెందిన రైతులు, గడ్డి మైదానాలను దాటివచ్చిన యురేసియన్ పశువుల కాపరులు, దక్షిణాసియాలోని వేటగాళ్ల సమూహాల్లో ఉన్నట్టు పేర్కొంది. వీరిలో ఇరానియన్ రైతులు క్రీ.పూ.4700 నుంచి క్రీపూ.3000 నడుమ, యురేసియన్ పశువుల కాపర్లు క్రీ.పూ.3000 తర్వాత ఇక్కడికి వలస వచ్చినట్టు వెల్లడించింది. అలాగే.. తాము పరిశీలించిన 2700 జీనోమ్‌లలో నియాండర్తల్స్, డెనిసోవన్ల జన్యువులు కూడా ఉన్నట్టు వివరించింది. భారతదేశంలో డెనిసోవన్లకు సంబంధించిన ఎలాంటి జాడలూ, శిలాజాలూ లేకున్నా వారి జన్యువులు భారతీయుల్లో ఉండడం గమనార్హం. అలాగే.. ఆధునిక భారతీయుల జన్యువులు ఎవరితో ఎక్కువ శాతం సరిపోలుతాయో తెలుసుకునేందుకు డీఎన్ఏ నమూనాలను విశ్లేషించగా.. ప్రస్తుత తజకిస్థాన్ ప్రాంతంలోని సరాజమ్ ప్రాంతంలోని రైతులతో బాగా దగ్గరి పోలికలు ఉన్నట్టు వెల్లడైంది.

కేజీబీవీల్లో కలెక్షన్ల కలకలం!

- ఎంటీఎస్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులిప్పిస్తాం...
- టీచర్ల నుంచి డబ్బుల వసూళ్లకు సంఘ నేత శ్రీకారం
- ప్రతి కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వసూలు టార్గెట్
- ప్రభుత్వంలో కీలక వ్యక్తుల సహకారం ఉందని మెసేజ్
- సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల ఫిర్యాదుతో విచారణ
- దేవరాపల్లి కేజీబీవీ సీఆర్‌టీ తొలగింపు... కేసు నమోదు

విశాఖపట్నం/అనకాపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో కలెక్షన్ల కలకలం రేగింది. వీటిలో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లను మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు తెస్తానంటూ టీచర్ల సంఘ నేత ఒకరు వసూళ్లకు శ్రీకారం చుట్టారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి కేజీబీవీలో తెలుగు సీఆర్‌టీగా పనిచేస్తున్న ఎస్‌టీటీఎస్ దేవి (కేజీబీవీ టీచర్ల సంఘం నేత)ని విధుల నుంచి తొలగించారు. రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో టీచర్లు కాంట్రాక్టు ప్రాతిపదికపైనే పనిచేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వీరి సర్వీసును పునరుద్ధరిస్తుంటారు. కాంట్రాక్టు టీచర్ల పోరాటం ఫలితంగా ఇటీవల వీరి జీతాలు స్వల్పంగా పెంచారు. ప్రస్తుతం కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు రూ.32వేలు, సీఆర్‌టీలకు రూ.27 వేలు ఇస్తున్నారు. అయితే ఎంటీఎస్ పరిధిలోకి వెళితే జీతాలు పెరగడమే కాకుండా సర్వీస్‌లో బ్రేక్ ఉండదని సంఘ నేతగా ఉన్న దేవి నమ్మబలికారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వెంటనే డబ్బులు ఇవ్వాలని, ప్రతి స్కూలు నుంచి ఒకరిద్దరు వసూలు బాధ్యత తీసుకోవాలని అన్ని జిల్లాల కేజీబీవీ టీచర్లకు చెందిన వాట్సాప్ గ్రూపుల్లో ఆమె మెసేజ్‌లు పెట్టారు. ఇందుకు ప్రభుత్వంలో అత్యంత కీలక వ్యక్తుల సహకారం ఉందని, అనుకున్న మొత్తం చూపించగలిగితే మరుసటిరోజు సాయంత్రానికి ఎంటీఎస్ వర్తింపజేస్తూ ఆదేశాలు వస్తాయని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. ఒక్కో కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వంతున రూ.కోట్లలో వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులు సీఎం పేషీకి ఫిర్యాదు చేశారు. వసూళ్ల వ్యవహారం వాస్తవమేనని విచారణలో తేలింది. ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు దేవిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం రాత్రి అనకాపల్లి డీఈవో/ సమగ్రశిక్ష ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. దేవిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవిపై అనకాపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కేజీబీవీ సంఘ నేతగా ఉన్న దేవిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన సందర్భంగా ప్రభుత్వానికి ఆమె అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఉద్యోగులు ఆరోపించారు. ఎస్ఎస్ఏ ప్రధాన కార్యాలయంలో ఒక కీలక అధికారి ఆశీస్సులతో కేజీబీవీలపైనా దేవి పెత్తనం చెలాయిస్తున్నారని చెబుతుంటారు. ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా గతేడాది దసపల్లా హోటల్‌లో కేజీబీవీ టీచర్లతో ఆమె సమావేశం నిర్వహించారు.

'మైనార్టీ'లో మాయాజాలం!

- బై ట్రాన్స్‌ఫర్ విధానంలో అనర్హులకు అందలం
- ఇతర శాఖల ఉద్యోగులకు అడ్డగోలుగా పదవులు
- నాన్ గెజిటెడ్ ఉద్యోగులతో గెజిటెడ్ పోస్టుల భర్తీ
- మంత్రి పేషీలోని ఇద్దరు అధికారుల చేతివాటం
- అండగా సచివాలయంలో మిడిల్ లెవల్ అధికారి
- పోస్టింగ్‌కు లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ అక్రమ నియామకాలకు అడ్డాగా మారింది. ఇతర శాఖల నుంచి అనర్హులను తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా గెజిటెడ్ హోదా పోస్టుల్లో నియమించారు. ఈ వ్యవహారంలో మంత్రి పేషీ సిబ్బంది పాత్ర ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ అడ్డగోలు నియామకాలు జనవరిలో జరగ్గా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైనార్టీ సంక్షేమ శాఖలో నాలుగు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇవన్నీ గెజిటెడ్ పోస్టులు. ఆ శాఖలో అర్హులు ఉంటే వాటిలో మూడింటిని పదోన్నతుల ద్వారా లేదా అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ (ఇతర శాఖల నుంచి తీసుకోవడం) ద్వారా, ఒక పోస్టును డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చి ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. అయితే మొత్తం నాలుగు పోస్టులనూ నిబంధనలకు విరుద్ధంగా అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ విధానంలో భర్తీ చేసేశారు. మరోవైపు ఏ శాఖలో అయినా ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన ఇతర శాఖల ఉద్యోగులతో భర్తీ చేసేటప్పుడు సమాన స్థాయి అధికారులను మాత్రమే నియమించాలనే నిబంధన ఉంది. అయితే మైనార్టీ సంక్షేమ శాఖలో రెండు ఏడీ పోస్టులు విద్యాశాఖలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ల (నాన్ గెజిటెడ్)తో, మరో రెండింటిని మైనార్టీ సంక్షేమశాఖ పేషీ అధికారులతో నింపేశారు. అయితే విద్యాశాఖ నుంచి వచ్చిన ఇద్దరి నుంచి మంత్రి పేషీలో అధికారులతో పాటు రాష్ట్ర సచివాలయంలో ఆ శాఖలో చక్రం తిప్పే మిడిల్ లెవల్ అధికారి సైతం రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అనర్హులకు అందలం

మైనార్టీ సంక్షేమ శాఖ పేషీలో డిప్యూటీ సీఎంకు అడిషనల్ పీఎస్‌గా విధులు నిర్వర్తించే మహమ్మద్ గౌస్ పీర్ కడప మున్సిపల్ కార్పొరేషన్ లో మేనేజర్ పోస్టింగ్. ఆయనది నాన్ గెజిటెడ్ పోస్టు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు శాఖలో ఏడీ పోస్టు కట్టబెట్టారు. ఏపీ దూదేకుల కార్పొరేషన్‌కి ఎండీగా కూడా ఆయన్ను నియమించారు. ఒక నాన్ గెజిటెడ్ అధికారిని ఏకంగా కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా మైనార్టీ సంక్షేమశాఖ మంత్రికి పీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న నిజాముద్దీన్ ఇరిగేషన్ శాఖలో గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నారు. ఆయన్ను కూడా శాఖలో ఏడీ పోస్టులో నియమించారు. ఉర్దూ అకాడమీ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చి, మళ్లీ అక్కడ నుంచి మార్చి ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ సెక్రటరీగా నియమించారు. ఈ హోదాలో నియమితులయ్యే వారు సచివాలయ సర్వీసులోని జాయింట్ సెక్రటరీ, అడిషనల్ సెక్రటరీ స్థాయి అధికారులై ఉండాలి. అయినా కూడా అడ్డదారులు తొక్కి అనర్హులకు అందలం వేశారు.

జిల్లా అధికారుల నియామకంలోనూ అక్రమాలు

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారుల నియామకంలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరుగురిని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారులుగా డిప్యుటేషన్‌పై నియమించినట్లు తెలిసింది. ఈ నియమకాల్లో కూడా శాఖ పేషీలోని అధికారులు, మిడిల్ లెవల్ అధికారితో చేతులు కలిపి ఒక్కొక్కరి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల వరకు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా వ్యవహరించి, స్వచ్ఛంద పదవీ విరమణ చేసి వైసీపీలో చేరిన అధికారితో ఈ మిడిల్ లెవల్ అధికారికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో శాఖలో ఈయన ఆడింది ఆటగా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అడ్డగోలు నియామకాలకు సంబంధించి కింది స్థాయిలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులను వేళాపాళా లేకుండా ఫైల్ పెట్టాలంటూ వేధించినట్లు రాష్ట్ర సచివాలయంలో చర్చ జరుగుతోంది. అయితే అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ పేరుతో శాఖలో జరిగిన నియామకాలు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రికి తెలియకుండా జరిగాయా? లేక మంత్రి ఆమోదంతోనే జరిగాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో జగన్ మేనత్త వైఎస్ విమలారెడ్డిని సత్కరిస్తున్న పాస్టర్లు

చేతికో ట్యాగ్.. కవర్

- జగన్ మేనత్త విమలారెడ్డి ఆధ్వర్యంలో పాస్టర్లతో భేటీ
- రవాణా ఖర్చుల పేరిట తలా 1000 పంపిణీ
- వెంట వచ్చిన సాధారణ సభ్యులకు రూ.500
- పరోక్షంగా వైసీపీకి మద్దతుగా పలువురు ప్రసంగం

పాడేరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మద్దతుగా ఆయన మేనత్త వైఎస్ విమలారెడ్డి అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. గురువారం స్థానిక ఫంక్షన్ హాలులో 'అల్లూరి జిల్లా సేవకుల సదస్సు' పేరిట ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె రాజకీయ ప్రస్తావన తీసుకురాకపోయినా, క్రిస్టియన్ మైనారిటీ సంఘాల పెద్దలుగా ఉన్న జాన్ వెస్లీ, జాన్‌సన్‌లు పరోక్షంగా వైఎస్ జగన్‌కు మద్దతుగా ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వం క్రైస్తవులకు అనుకూలంగా ఉందని, భవిష్యత్తులో సైతం ఇదే ప్రభుత్వం అధికారంలో ఉంటే మంచి జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి హాజరైన పాస్టర్లకు రవాణా ఖర్చుల పేరిట తలా రూ.వెయ్యి వారి వెనుక వచ్చిన సాధారణ సభ్యులకు రూ.500 చొప్పున పంపిణీ చేశారు. డబ్బులు పంపిణీ కార్యక్రమం కోసం (ఒకసారి తీసుకున్నవారు రెండోసారి తీసుకోకుండా) ప్రతి ఒక్కరి చేతికి ట్యాగ్ వేశారు. సమావేశం అనంతరం ఆ ట్యాగ్‌ను కట్ చేసిన తర్వాత వారికి డబ్బులున్న కవరు అందజేశారు. జిల్లాలోని పాస్టర్లందరినీ ఈ సమావేశానికి ఆహ్వానించినప్పటికీ కొందరు రాలేదు. పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల నుంచి సుమారు వెయ్యి మంది వరకు హాజరు కాగా, వారిలో మూడొంతులు సాధారణ సభ్యులు, ఒక వంతు పాస్టర్లు ఉన్నారు.

జనసేన ప్రచారానికి ఎన్ఆర్ఐ విరాళం

- 30 ఇన్నోవా వాహనాలను సమకూర్చిన ఉదయభాస్కర్

తిరుపతి అర్బన్, మార్చి 7: అమెరికాలోని అట్లాంటాలో స్థిరపడ్డ కొట్టే ఉదయభాస్కర్ జనసేన ప్రచారానికి 30 ఇన్నోవా వాహనాలను అందజేశారు. తిరుపతిలోని అలిపిరి మార్గంలో ఈ వాహనాలకు గురువారం ఉదయం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ... ఈ వాహనాలను జనసేన పోటీ చేసే నియోజకవర్గాల్లో ప్రచారానికి వినియోగిస్తామన్నారు. జనసేన చిత్తూరు గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య, అధికార ప్రతినిధి కీర్తన తదితరులు పాల్గొన్నారు.

బిల్లు చెల్లించకుండానే లాక్కున్నారు..!

- హిందూపురం తహసీల్దార్ ఆఫీసులో నూతన భవనం నిర్మాణం
- బిల్లులు చెల్లించకపోవడంతో తాళాలు వేసిన కాంట్రాక్టరు
- జేసీ ఆదేశాలతో పగులగొట్టిన అధికారులు
- అయినా కొత్త తాళం వేసుకున్న కాంట్రాక్టరు



కాంట్రాక్టర్‌తో గొడవకు దిగిన డీటీ, రెవెన్యూ సిబ్బంది

హిందూపురం అర్బన్, మార్చి 7: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం తహసీల్దారు కార్యాలయ ఆవరణంలో నిర్మించిన నూతన భవనాన్ని అధికారులు దౌర్జన్యంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. బిల్లులు చెల్లించేదాకా భవనాన్ని అప్పగించేది లేదని కాంట్రాక్టర్ బాలాజీ అడ్డుకోవడంతో ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో హిందూపురం తహసీల్దారు కార్యాలయ భవ నిర్మాణానికి రూ.90 లక్షలతో టెండర్లు పిలిచారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ బాలాజీ, 2018లో పనులను ప్రారంభించారు. మొదటి దశలో రూ.30 లక్షలు బిల్లు చెల్లించారు. ఆ తరువాత నిర్మాణ పనులను కాంట్రాక్టర్ దాదాపు పూర్తి చేశారు. ఆ సమయంలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో సమస్య మొదలైంది. మిగిలిన బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో బిల్లు వచ్చాక భవనాన్ని అప్పగిస్తానని కాంట్రాక్టర్ అధికారులకు చెప్పారు. వారు సరే అన్నారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వరులు, ఆర్ఐ తదితరులు భవనం తాళాలను పగులగొట్టి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ బాలాజీ అడ్డుగా నిలిచారు. ఆయనతో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వాగ్వాదానికి దిగారు. భవనంపై తమకు సర్వహక్కులు ఉన్నాయని, ఎన్నికల విధుల నిర్వహణకు స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. దౌర్జన్యంగా తాళం పగులగొట్టారు. మునిసిపల్ కార్మికులతో భవనాన్ని శుభ్రం చేయడానికి ప్రయత్నం చేశారు. అయినా కాంట్రాక్టర్ పట్టు విడువలేదు. బిల్లులు చెల్లిస్తేనే భవనాన్ని స్వాధీనపరుస్తానని చెబుతూ.. మరోమారు భవనానికి తాళం వేసుకున్నారు.

గుప్త నిధుల అడ్డా ఎన్నికల బాండ్లు

- జాతీయపార్టీలకు గుప్త మార్గాల్లో రూ.1,832 కోట్లు
- 2022-23లో పార్టీలకు అందిన విరాళాల ఆధారంగా నివేదిక విడుదల చేసిన ఏడీఆర్

న్యూఢిల్లీ, మార్చి 7: జాతీయ పార్టీలకు గుప్త మార్గా ల్లో అందిన నిధుల్లో 82.42% ఎన్నికల బాండ్ల రూపంలోనే లభించాయని స్వతంత్ర ప్రజాస్వామ్య వేదిక ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తెలిపింది. 2022-23 సంవత్సరానికి జాతీయ పార్టీలు ఈసీకి సమర్పించిన విరాళాల జాబితా, ఆడిట్ నివేదికలను పరిశీలిస్తే ఈ విషయం తెలిసిందని వివరించింది. ఆ ఏడాది ఈ పార్టీలకు అందిన విరాళాల్లో మొత్తం రూ.1,832.88 కోట్లు గుప్త మార్గంలో అందగా, అందులో రూ.1,510 కోట్లు ఎన్నిల బాండ్ల రూపంలో లభించాయని తెలిపింది. బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ, ఆప్, నేషనల్ పీపుల్స్ పార్టీల (ఎన్‌పీపీ) ఆడిట్, ఇతర ఆర్థిక వివరాలపై సేకరించిన సమాచారం ఆధారంగా ఏడీఆర్ తన నివేదికను తయారుచేసింది. దీనిని అనుసరించి.. ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు అందుకు న్న పార్టీల్లో బీజేపీ ముందు వరుసలో ఉంది. 2022-23లో జాతీయ పార్టీలు ఆర్జించిన మొత్తం ఆదాయంలో బీజేపీ కి రూ.1,400 కోట్లు (76.39%) ఈ రూపంలోనే లభించాయని తెలిపింది. ఇక.. కాంగ్రెస్‌కు రూ.315.11 కోట్లు (17.19%) లభించాయని ఏడీఆర్ పేర్కొంది. వలంటరీ కంట్రిబ్యూషన్లు/కూపన్ల అమ్మకం/ఎన్నికల బాండ్లు, గుప్త మార్గాల్లో తమకు రూపాయి కూడా అందలేదని బీఎస్పీ ప్రకటించిందని వెల్లడించింది. అయితే, బ్యాంకు వడ్డీ, సభ్యత్వ రుసుం, స్థిరాస్తి అమ్మకాలు తదితర మార్గాల్లో బీఎస్పీకి రూ.29.27 కోట్ల ఆదాయం లభించిందని పేర్కొంది. కూపన్ల అమ్మకం ద్వారా తమకు రూ. 136.79 కోట్లు లభించాయని కాంగ్రెస్, సీపీఎం తెలిపాయని పేర్కొంది. ఎన్నికల బాండ్ల వినియోగంలో జాతీయ పార్టీల ప్రస్తావన ప్రముఖంగా కనిపించినా, ప్రాంతీయ పార్టీలూ గణనీయమైన స్థాయిలోనే ఈ నిధులను పొందుతున్నాయని ఏడీఆర్ వెల్లడించింది.

అక్కడి ఘటనలపై మోదీ నోరు మెదపరు!

- మాకు మాత్రం పాఠాలు చెబుతారు
- యూపీ, మణిపూర్‌లలో మహిళలపై దారుణమైన అకృత్యాలు
- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విమర్శలు

కోల్‌కతా, మార్చి 7: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరిగే అకృత్యాల గురించి నోరు మెదపని ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. బెంగాల్ విషయంలో మాత్రం తమకు పాఠాలు చెబుతున్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ విమర్శించారు. సందేశ్‌ఖాలీ ఘటనలపై బీజేపీ పెద్ద ఎత్తున పుకార్లను వ్యాపింపజేస్తోందని, వాస్తవానికి దేశంలోనే మహిళలకు పశ్చిమ బెంగాల్ అత్యంత సురక్షిత ప్రాంతమని మమత తెలిపారు. గురువారం కోల్‌కతాలో 'మహిళల హక్కులకు కట్టుబడి ఉన్నాం' అనే పేరుతో తృణమూల్ నిర్వహించిన మహిళా ర్యాలీలో మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్యాయాలు, అకృత్యాల గురించి తమకు తెలిసినప్పుడు వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, తమ పార్టీకి చెందిన వారు తప్పు చేసినా వదిలిపెట్టమని హెచ్చరించారు. ప్రధాని మోదీని పరోక్షంగా ప్రస్తావిస్తూ.. 'నిన్న ఇక్కడికి వచ్చి మహిళల మీద బెంగాల్‌లో జరుగుతున్న అకృత్యాల గురించి మాకు బోధనలు చేశారు. కానీ, యూపీలో మహిళల మీద అత్యంత దారుణమైన అత్యాచారాలు జరుగుతున్నాయి. మణిపూర్‌లో మన బిడ్డలను రేప్ చేసి కాల్చి చంపుతున్నారు. దీనికి బీజేపీ సిగ్గుపడాలి' అని మమత పేర్కొన్నారు. సందేశ్‌ఖాలీ తుఫాను బెంగాల్‌ను ఊపేస్తుందని, లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్‌ను ఓడించటంలో నారీశక్తి కీలక పాత్ర పోషిస్తుందని బుధవారం ఆ రాష్ట్ర పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ హెచ్చరించిన విషయం తెలిసిందే. మరోవైపు, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరిన జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ బెంగాల్‌లో ఎక్కడి నుంచి పోటీ చేసినా ఓడిస్తామని మమత ప్రకటించారు. రాష్ట్రంలో మతవిద్వేష రాజకీయాలను తాను అనుమతించను కాబట్టే బీజేపీ వాళ్లకు తనపై ఆగ్రహమని మమత విమర్శించారు. కాగా, గురువారం సందేశ్‌ఖాలీకి వెళ్తున్న బీజేపీ మహిళా నేతలను పోలీసులు కోల్‌కతా శివార్లలో అడ్డుకోవడంతో వారు నిరసన తెలిపారు.

ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్లు!

- జారీ చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం
- కోర్టులో పెండింగ్ ఉండగా ఎలా ఇస్తారంటున్న డీలర్లు

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్లకు ఆథరైజేషన్లు(అధికార పత్రాలు) జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. వారిపై భౌతిక దాడులు జరగకుండా నివారించేందుకు జిల్లా ఎస్పీలు పోలీసు రక్షణ కల్పించాలని నిర్దేశించింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ సర్క్యులర్ జారీ చేశారు. కొంతమంది రేషన్ డీలర్లు, వారి కుటుంబసభ్యులు, బంధువులే ఎండీయూ ఆపరేటర్లుగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, అలాంటివారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. విశాఖపట్నంలో పెండింగ్ ఉన్న ఎండీయూ ఆపరేటర్లకు ఈనెల 20వ తేదీలోపు ఆథరైజేషన్ల జారీని పూర్తి చేయడానికి ఆ జిల్లా సబ్‌కలెక్టరు, ఆర్డీవోలు, డీఎస్‌వోలు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ ఆదేశించారు.

రేషన్ డీలర్ల అభ్యంతరం

ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్ పత్రాలను జారీ చేయడాన్ని రేషన్ డీలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో కేసు వేయగా, విచారణలో ఉంది. కోర్టు తీర్పు వెలువడకుండానే ఎండీయూ ఆపరేటర్లకు ఆథరైజేషన్లు ఇవ్వాలంటూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని డీలర్లు తప్పుబడుతున్నారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం.. ఇంటర్ విద్యార్హత, నోటిఫికేషన్, రోస్టర్ పద్ధతిని పాటిస్తూ రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ఉత్తీర్ణులైనవారిని రేషన్ డీలర్లుగా నియమించారని, ఇలా ఎంపికైనవారి నుంచి రూ.25 వేలు డిపాజిట్ కట్టించుకుని డీలర్లకు ఆథరైజేషన్లు ఇచ్చారని చెబుతున్నారు. కాబట్టి రేషన్ సరుకుల పంపిణీకి డీలర్లకు తప్ప ఎండీయూ ఆపరేట్లకు ఆథరైజేషన్‌లు ఇవ్వడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలి

- లేకపోతే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తాం: ఫారూక్ సిబ్లీ

కర్నూలు, మార్చి 7: దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును ఆ పదవి నుంచి తొలగించి, అతడిపై చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ సిబ్లీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కర్నూలు నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి, సమతా సైనిక్ దళ్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫారూఖ్ సిబ్లీ మాట్లాడుతూ, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్యకేసును సీబీఐకి అప్పగించాలన్నారు. లేనిపక్షంలో తాడేపల్లిలోని సీఎం జగన్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు తదితరులు హాజరయ్యారు.

సచివాలయంలో కేఏ పాల్ బైఠాయింపు

- ఈసీ భేటీలకు ప్రజాశాంతి పార్టీని పిలవలేదని నిరసన



సచివాలయం మెట్లపై బైఠాయించిన కేఏ పాల్

అమరావతి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేరు లేని పార్టీలను ఎన్నికల కమిషన్ ఆహ్వానించి, ప్రజాశాంతిని పిలవకపోవడంపై ఆపార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశానికి తమకు ఆహ్వానం లేకపోవడంపై ప్రశ్నించడానికి ఆయన సచివాలయానికి వచ్చారు. అయితే ఎన్నికల ప్రధాన అధికారిని కలవటానికి అనుమతి లేదని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ఆయన ఐదో బ్లాక్ ముందు బైఠాయించి, నిరసన తెలిపారు. ఎన్నికల సంఘం సమావేశాలకు తన పార్టీకి ఆహ్వానం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దేశంలో స్వచ్ఛంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరిగాలి. లేకపోతే ఎన్నికలను బహిష్కరించడానికి ప్రజలు సిద్ధం కావాలి' అని పిలుపు ఇచ్చారు.